# వాణి

సంపుటి 51 సంచిక 130 ఆగష్టు 2020

**పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి**



**సుముఖశ్చైక దంతశ్చ కపిలో గజకర్ణకః**

**లంబోదరశ్చ వికటో విఘ్నరాజో వినాయకః**

# విషయ సూచిక


**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి**..........1

సెక్రెటరీ రిపోర్ట్ – **వాణి మోటమఱ్ఱి** ..........2


## శీర్షికలు


శ్రీమద్భగవద్గీత - పెయ్యేటి రంగారావు..........5

గణపతికి ప్రీతికరమైన దూర్వ మహాత్యం - లలిత రాంభొట్ల..........9

ఏకాదశ  గణపతి ప్రార్ధన - లక్ష్మి గొర్తి..........16

దేశభక్తి - వచన కవితా గీతం - జయంత్ కుమార్..........18

పిల్లికి చెలగాటం – రంగారావు పెయ్యేటి..........21

కవిత్వ మంటే??-డా మూర్తి చెన్నాప్రగడ..........24

ఓ జ్యోతి కథ- శ్రీదేవి పెయ్యేటి..........27

అక్షరాల తొలగింపు - ఉమామహేశ్ శనగవరపు..........33

నండూరివారి ఊహాలోకంలో - విజయగొల్లపూడి..........36

మహిమ - డి. కామేశ్వరి..........43

పాట నేర్చుకుందామా పాడుకుందామా..........50

అమెరికార్తీకుల భోజనాలు- చిట్టెన్ రాజు వంగూరి ..........53

పావురముల అతిథి సత్కారం-పెయ్యేటి నాగేంద్ర కుమార్..........56

బాలవాహిని ..........58

ఆధునిక రచయిత్రుల పరిచయాలు- అనురాధ యలమర్తి..........62

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |

# సంపాదకీయం

తెలుగువాహిని ఆగష్టు నెల సంచిక పఠనానికై మీ అందరికీ ఆహ్వానం.

తెలుగు సాంస్కృతిక, సాహిత్య వేడుకల వెల్లువ కరోనా పుణ్యమా అని నలుదిశలా తెలుగు భాషాప్రవాహం గా ఉరకలేస్తోంది. తెలుగు భాషా ప్రేమికులంతా కష్టకాలాన్ని మరిచి భాష మీద దృష్టిని సారించారు. దానికి నిదర్శనం సింగపూర్ లో శ్రీ రత్న కుమార్ గారు శ్రీ సాంస్కృతిక కళాసారధి సంస్థ నెలకొల్పి ఘనంగా సాహితీ సదస్సు  నిర్వహించారు.

ఇక అమెరికా 'తానా' వారి ప్రోద్బలంతో ప్రపంచం నలుమూలలా నలభై దేశాలనుంచి నూటికి పైగా తెలుగు సంఘాలు ఏకమై 33 సాంస్కృతిక విభాగాలలో పోటీలు నిర్వహించిన తీరు నభూతో నభవిష్యతి.

మన తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ సతీష్ బాబు వరదరాజుగారు ఇటు కోవిడ్ కష్టకాలంలో తెలుగువారికి చేయూతనందిస్తూ, కార్యనిర్వాహక సభ్యులతో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తూ సిడ్నీ తెలుగువారిని అంతర్జాలంలో కార్యోన్ముఖులను చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భారత స్వాతంత్ర్యదినోత్సవం రోజు డా. మీగడ రామలింగస్వామి గారితో సంగీత నవావధానం అంతర్జాలంలో తెలుగువారికి సాహిత్యంలో సుమధుర పద్యాల సమాహారం. ప్రతి ఒక్కరు వీక్షించగలరని భావిస్తున్నాము. మరిన్ని వివరాలకు వాహిని ముందు పేజీలలో చూడండి.

భారతీయులందరికీ అతి ముఖ్యమైన పర్వదినం వినాయకచవితి 22వ తేదీన రాబోతోంది. సాధ్యమైనంతవరకు నాలుగు గోడలమధ్య కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవలసిన పరిస్థితి. సాధ్యమైనంతవరకు బయటకు వెళ్ళకుండా, గుమిగూడి వెళ్ళే ప్రయత్నాలు మానుకుంటే అదే పదివేలు. కరోనా బారి నుంచి  ఎవరికి వారు ప్రపంచంలో ప్రతిచోట రక్షక కవచం వేసుకోవాలి.

తెలుగు వాహిని మాసపత్రిక రచయిత/త్రు లకు, పాఠకులకు, ప్రోత్సాహకులకు, ప్రకటనదారులకు మరియు సిడ్నీ తెలుగు అసోసియేషన్ కార్యనిర్వాహణ వర్గానికి, సబ్ కమిటీ వారికి అందరికీ భారత స్వాతంత్ర్య దినోత్సవ మరియు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ.....

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**


**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: సతీష్ వరదరాజు
0408 469 758


వైస్ ప్రెసిడెంట్:  శ్రీ మధు బైరెడ్డి
0425 209 397


సెక్రెటరీ:  వాణి మోటమఱ్ఱి
0418 184 111


ట్రెసరర్:మూర్తి ఓలేటి
0402 137 475



కమిటీ మెంబర్:  వీర్రాజు గున్నం
0431 714  501


కమిటీ మెంబర్: మోహన్ కుమార్ పరస్సు  0419 219 526


కమిటీ మెంబర్:  హరిబాబు కొల్లూరి
0425 291 032


## సబ్ కమిటీలు



వాణి కన్వీనర్ : సారధి మోటమఱ్ఱి
0430 002 130


వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి  0438 293 687


తెలుగు స్కూల్ కోఆర్డినేటర్
మల్లిక్ రాచకొండ  0431 680 092


వనితా మండలి  కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0400 031 546



సిడ్నీ తెలుగు సీనియర్స్  కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## UIA మెంబర్


శ్రీని పిల్లమఱ్ఱి
0452 025 666

## ఫైనాన్సియల్ అడ్వైసరి కమిటీ (FAC)


మూర్తి పోతుకూచి


శ్రీనాధ్ ఖండవల్లి


సుందరం రాచకొండ


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear STA Members and friends,

Greetings, I am sure we all are getting used to online work meetings and social events. Is it me who is overwhelmed with myriad of online sessions or you feel it to? In the past, we used to have handful of events in a year where we used to meet physically. Now, we can participate in multiple events in a month from the comfort of our home.

As part of Cancer Council Australia's Biggest Morning Tea **STA Vanitha Mandali** organized 2 events in July – "Post COVID Depression " presented by the guest speaker, Dr. Shankar Vadali on 11th of July'20 & "Coping with Covid-19 challenges", a session specially planned for Youth (Year 6- Year 12) by the guest speaker, Dr. Pratyusha Sanagavarapu on 18th July'20. Both speakers came well prepared with informative slide deck. The sessions were well received by participants. On behalf of Sydney Telugu Association Executive Committee, we convey our appreciation to Dr. Shankar Vadali, Dr. Pratyusha Sanagavarapu and Smt. Shoba Vennelakanti, Vanitha Mandali Coordinator.

Another milestone event happened in July which is like a feather in the cap for Telugu People in Australia. NAATI (National Accreditation Authority for Translators and Interpreters) announced that Telugu has been added in the Credentialed Community Language (CCL) Testing, https://www.naati.com.au/news/telugu-announcement/ . The CCL Test is generally taken by the applicants who are looking to lodge a point-based visa application. On successfully passing the test, applicants are awarded five bonus points. **Congratulations** to FTAA (Federation of Telugu Associations in Australia) and other Telugu Associations across Australia who worked towards making this happen.

World Telugu Cultural Festival, WTCF 2020, the online Cultural event with the tagline "ప్రపంచ ప్రవాస తెలుగువారందరూ ఒక్కటిగా… తెలుగు భాష వైభవాన్ని చాటేందుకు కలిసికట్టుగా", headed by TANA with over 100 Telugu Associations across 45+ countries. The event took place over 2 weekends. First round competitions took place from 24th to 26th of July'20 with 18,000 over registrations for 8 Segments, 35 Categories and 4 different age groups (3-10, 11 to 15, 16-20 and 20+). 2nd round of competitions took place from 31st July to 1st August'20. Members of Sydney Telugu Association took active part in the event with some of our members taking roles as organizers and judges. Personally, I was involved in the event as Executive Single Point of Contact for Telugu Velugu. Spent 2 to 3 weeks right from planning to execution working in Indian time zones during competitions, some days stretching from 14 to 16 hours without a break. It was an amazing experience working with teams spread across the globe. The senior participants (70+ years) took part with the same excitement and passion as the little ones (3 years). I will not exchange this experience with anything.  On behalf of WTCF executive team, STA President, Sateesh Babu Varada Raju garu and I congratulate to all the winners and participants from Australia and thank all

the Organizers and Judges for giving helping hand and spending your valuable time for the massive worldwide event.

To mark the India Independence Day, Sydney Telugu Association is bringing yet again another exciting and fun filled evening. We are inviting one and all for “Sangita Navavadhanam” by Dr. Meegada Ramalingaswamy on 15th Aug’20 (Saturday) at 3.00 PM AEST. This is going to be first ever Sangita Navavadhanam event via Zoom. Please send your RSVP for Zoom Link to Sri Saradhi Motamarri on 0430022130 or email:vani@Sydneytelugu.org. The event will also be Live Telecast on www.facebook.com/SydneyTelugu.

మీ అందరికీ కృష్ణ జన్మాష్టమి, వినాయక చవితి, నాగ పంచమి, మొహర్రం పండుగ శుభాకాంక్షలు. Happy Independence Day.

**29th August is observed as** తెలుగు భాషా దినోత్సవం. This date was chosen to coincide with the birthday of the **Telugu** poet Gidugu Venkata Ramamurthy.

Month of August is loaded with festivals. Our traditions are important but please note under the current pandemic situation, do comply with the Government Directives/Health Guidelines and Stay Safe while celebrating. Thank you.

Best Regards,
Vani Saradhi Motamarri,
Secretary, Sydney Telugu Association



**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖



## అథ ప్రథమోధ్యాయః = అర్జున విషాదయోగః

## (మొదటి అధ్యాయము - అర్జున విషాదయోగము)

36.

నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన |

పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః || 36 ||

జనార్దన = ఓ జనార్దనా!

ధార్తరాష్ట్రాన్ = ధృతరాష్ట్రుని కుమారులను

నిహత్య = చంపినచో

నః = మనకు

కా, ప్రీతిః స్యాత్? = ఎట్టి సంతోషము కలుగును?

ఏతాన్ = ఇట్టి

ఆతతాయినః = ఆతతాయులను (దుష్టులను)

హత్వా = చంపుట వలన

అస్మాన్ = మనలను

పాపమ్, ఏవ ఆశ్రయేత్ = పాపమే చుట్టుముట్టును.

ఓ జనార్దనా! ఈ ధార్తరాష్ట్రులను చంపి మనము ఏమి బావుకొందుము? దుర్మార్గులైనప్పటికీ, వీరిని వధించినందు వలన మనకు పాపమే కలుగును.

అగ్నిదోగరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహృత్ | క్షేత్రదారహరశ్చైవ షడైతే హ్యాతతాయినః || ఇళ్ళకి నిప్పు పెట్టేవారిని, విషప్రయోగం చేసే వారిని, కారణం లేకుండా శస్త్రాస్త్రములను ధరించేవారిని, పరధనములను అపహరించేవారిని, పరుల భూములను అపహరించే వారిని, పరుల భార్యలను అపహరించే వారిని - ఈ ఆరుగురిని ఆతతాయిలంటారు.

అర్జునుడు 'జనార్దన!' అని సంబోధించడం జరిగింది. 'ఓ శ్రీకృష్ణా! ప్రళయకాలంలో నీవు సర్వజనసంహారం చేసినప్పటికీ, నీవు పరమాత్మవు కనుక నిన్ను ఏ పాపమూ అంటదు. కాని నాకు అలా కాదు కదా? ఇందరు స్వజనులను వధిస్తే ఆ పాపం నాకు తప్పకుండా చుట్టుకుంటుంది.' అని అర్జునుడు జనాంతికంగా అన్నాడు.

37.

తస్మాన్నార్హావయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ 37 ॥

తస్మాత్ = అందువలన
మాధవ! = ఓ మాధవా!
స్వబాంధవాన్ = మన బంధువులైన
ధార్తరాష్ట్రాన్ = ధార్తరాష్ట్రులను
హంతుమ్ = హతమార్చుటకు
వయమ్ = మనము
న, అర్హాః = అర్హులము కాము. (మనము వారిని చంపదగదు).
హి = ఏల యన
స్వజనమ్ = స్వజనులను
హత్వా = చంపి
కథం, సుఖినః = ఎట్లు సుఖులము
స్యామ = కాగలము?

కనుక ఓ మాధవా! మన బంధువులైన ఈ ధార్తరాష్ట్రులను, వారు దుర్మార్గులైనప్పటికీ, చంపుట మనకు తగదు. స్వజనులను చంపిన మనకు సుఖము ఎట్లు కలుగును?
అర్జునుడు స్వ, స్వ అని కలవరిస్తున్నాడు. స్వబాంధవాన్, స్వజనం...... అంటే నేను, నాది అన్న అహంకారం, మమకారం అతనిలో బాగా వున్నాయి. ఈ రెండూ కూడా జీవుడికి మోక్షమార్గంలో మహా ప్రతిబంధకాలై నిలిచి వుండేవి. 'ఈ దేహమే నేను; అని అనుకుంటున్నంత వరకు, ఈ దేహాభిమానం వున్నంత వరకు జీవుడు భవబంధాల నుంచి విముక్తుడు కాలేడు. అందుకే ఇప్పుడు శ్రీకృష్ణపరమాత్మ 'నీవు ఆత్మవే కాని దేహానివి కాదు' అన్న అఖండ జ్ఞానోపదేశం ద్వారా అతడిలో వున్న అహంకార, మమకారాలను తొలగించడానికి పూనుకున్నాడు.

38, 39.

యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥ 38 ॥

కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥ 39 ॥

యద్యపి = ఒక వేళ
లోభోపహత చేతసః = లోభముచే భ్రష్టచిత్తులై
ఏతే = వీరు
కులక్షయకృతమ్ = కులనాశము వలన కలుగు

దోషమ్, చ = దోషమును

మిత్రద్రోహే = మిత్రదోహ కారణముగా

పాతకమ్, చ = (కలుగు) పాపమును

న, పశ్యంతి = చూడకున్న వారైనను

జనార్దన = ఓ జనార్దనా

కులక్షయకృతమ్ = కులక్షయము వలన కలుగు

దోషమ్ = దోషమును

ప్రపశ్యద్భిః = చక్కగా ఎరిగిన వారమైన

అస్మాభిః = మనచే

అస్మాత్ = ఇట్టి

పాపాత్ = పాపము నుండి

నివర్తితుమ్ = మరలుటకు

కథమ్ = ఏల

న, జ్ఞేయమ్ = ఆలోచింపరాదు?

లోభకారణముగ భ్రష్టచిత్తులైన వీరు కులక్షయము వలన కలుగు దోషములను, మిత్రద్రోహము వలన కలుగు పాపములను గమనింపకున్నచో, ఓ జనార్దనా! కులనాశనము వలన కలుగు నష్టములను ఎరింగిన మనము ఈ పాపములకు దూరముగా వుండుటకు ఏల ఆలోచింపరాదు?

40.

కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః |

ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోఽభిభవత్యుత ||40|

కులక్షయే = కులము నశింపగా

సనాతనాః = ప్రాచీనములైన

కులధర్మాః = కులధర్మములు

ప్రణశ్యంతి = నశించుచున్నవి.

ధర్మే, నష్టే = ధర్మము నశించినచో

కృత్స్నమ్ = సమస్తమైన

కులం = కులమును

అధర్మః, = అధర్మము

అభిభవతి = తిరస్కరించుచున్నది.

కులక్షయమైన యెడల కులధర్మములను పాలించువారు నశించెదరు. వారు లేనియెడల చిరంతనములగు కులధర్మములు (అగ్నిహోత్రాది కర్మల వలన సాధింప దగిన ధర్మములు) నశించిపోవును. అట్టి ధర్మము నశించెనేని నశింపగా మిగిలిన కులమున అధర్మము వ్యాపించుచున్నది.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

TELUGU ASSOCIATION INC.,SYDNEY

తెలుగు అసోసియేషన్ సిడ్నీ

www.facebook.com/sydneytelugu www.sydneytelugu.org

సంగీత సాహిత్యభిమానులరా ! తెలుగు వెలుగు జిలుగులారా !

సహృదయ సంగీత సాహితీ ప్రియంజలి !

**SYDNEY TELUGU ASSOCIATION IS ORGANIZING SANGITA NAVAAVADHANAM**

To mark the India Independence Day

Saturday **15-August-2020** at **3P.M** Sydney Time (**10:30 IST**)

# సంగీత నవావధానం

## డా. మీగడ రామలింగస్వామి

## Dr Meegada Ramalingaswamy



**27 నంది పురస్కారాల విజేత, నవావదాన రూపకర్త స్వర్ణ కిరీట గ్రహీత**



Honorary Guest:

**Sri Vruddula Kalyana Ramarao**

Lawyer, Founding President of Sahitya Surabhi, Visakhapatnam

**FIRST EVER SANGITA NAVAAVADHANAM VIA ZOOM**

**All are Welcome**

RSVP for Zoom Link:

**Sri Saradhi Motamarri,** Event Convener

on **+61 430 022 130** or Email: **vani@sydneytelugu.org**

Event will also be Live cast on

**www.facebook.com/sydneytelugu**

Designed by DSLRcrew - 0403226300

## నవావధాన విధానం

▾ పురాణం ▾ శతకం ▾ ప్రబంధం ▾ నాటకం ▾ అవధానం ▾ ఆధునికం ▾ శ్లోకం

వీటిల్లో ఒక్కొక్క అంశం నుండి 20 పద్యాలు / శ్లోకాలు, 20 రాగాల పేర్లు పృచ్ఛకులకు ఇస్తాం. వారికిష్టమైన పద్యం, రాగం ఎంపిక చేసుకొని నన్ను (నవావధానిని) స్వరపరచమని ప్రశ్నిస్తారు. వ్యవధి, వాద్య సహకారం లేకుండా (శృతి మాత్రమే ఉంటుంది.) వారడిగిన పద్యాన్ని అప్పటికప్పుడు స్వరపరచి చదవడం జరుగుతుంది. 7 X 20 = 140 పద్య శ్లోకాలు, 20 రాగాల్లో .... అంటే 2800 విధాలుగా అడిగే అవకాశం పృచ్ఛకులకు ఉంటుంది. చెప్పే అవకాశం అవధానికి ఉంటుంది.

**FOR FURTHER DETAILS CONTACT: MADHU BYREDDY 0425209397 | VANI MOTAMARRI 0418184111**

**MURTHY VOLETI 0402137475 | | MOHAN KUMAR PARASU 0419219526 | | HARI KOLLURI 0425291032 | RAJ GUNNAM 0431712501**

President: **SATEESH BV RAJU** Mobile: 0408469758 Email: ec@sydneytelugu.org

# గణపతికి ప్రీతికరమైన దూర్వ మహాత్యం

-శ్రీమతి లలిత రాంభట్ల, హైద్రాబాద్



హిమవంతుని పుత్రికైన పార్వతీదేవికి పరమేశ్వరునికి కళ్యాణము. మగపెళ్లి వారైనా సరిగా బంధుజనుల లేరు చుట్టాలు కూడా సరిగా లేనివాడు ఈ శివుడా! నాకు అల్లుడు అని హిమవంతుడు తక్కువ చూపు చూస్తాడు. శివుడు తన మామగారి అహంకారాన్ని తొలగించాలని అనుకుంటాడు. మామగారికి కబురు పెట్టి తనతో వచ్చిన చిన్న కుర్రవాడు ఆకలిగా ఉంది అతడు ఆకలికి ఆగలేకపోతున్నాడు కొద్దిగా అన్నం పెట్టమని కోరితే అందుకు పర్వతరాజు ఆ చిన్న కుర్రాడికి అన్నం వడ్డించమని ఆదేశించాడు, ఆ కుర్రవాడికి అన్నం వడ్డించడం ప్రారంభించారు, పెళ్లివారు అందరికీ ని వండిన వంటలన్నీ ఖాళీ అయిపోయినవి. అయినా ఆ కుర్రవాడికి ఆకలి తీరలేదు వంటకాలు అన్నీ అయిపోయాయి. పప్పు, బియ్యం, కూరగాయలు అన్నీ అయిపోయాయి, చివరకు ఆ చిన్న కుర్రవాని ఆకలిని తీర్చే లేకపోయినాడు. ఒక చిన్న కుర్రాడి ఆకలి తీర్చలేకపోయిన వారు మీరు ఏమి మర్యాదలు చేయగలరు అని ప్రశ్నించారు. హిమవంతుడు అహంకారం తొలగిపోయి కనువిప్పు అయి ఆ చిన్న కుర్రాడికి తృప్తి కలిగేట్టు చేయటానికి ఏమి మార్గము అని అడుగగా ఆకాశవాణి ఇట్లు పలికింది, ఆ చిన్న కుర్రవాడు విఘ్నవినాయకుడు, ఒక గరికపోచ భక్తితో సమర్పించమని

తెలిపింది. హిమవంతుడు గరికను తెప్పించి సమర్పించినాడు గణేశుడు అది ఆరగించి తృప్తి చెందినాడు. కావున గణేశునికి గరిక మహా ప్రీతికరమైనది.

అకార చరణ విశ్వంభరణ

ఉకార లంబోదర ధీకరణ

మకార మస్తక శివ హరి స్మరణ

జయ జయ ప్రణవేశ! గణేశ!

అంటే గణపతి ఓంకార స్వరూపుడు అకారం చరణాలను, ఉకారం పొట్టను, మకారం శివ హరులను  స్మరించే అంగాలు కలిగిన గణపతిని ఓంకార స్వరూపుడిగా వేదాలు చెబుతున్నాయి.

**వినాయక చవితి ప్రాముఖ్యత**

వినాయక చవితి, భాద్రపద శుద్ధ చతుర్థి నాడే వస్తుంది కారణం ఏమిటి అంటే భాద్రపదమాసం సూర్యుడు సింహరాశి చివరలో ఉండగా వస్తుంది. శుక్లపక్ష చవితి నాడు చంద్రుడు కన్యారాశిలో హస్తా నక్షత్రం మీద ఉదయిస్తాడు. కన్యారాశి రాసులలో అరవది. చంద్రుడు ఉదయించే సమయానికి శిరస్సున హస్త నక్షత్రంలో కనిపిస్తాడు హస్త అంటే ఏనుగు ముఖం అని అర్థం. హస్తలో చంద్రుడు ఉండగా ఉదయిస్తాడు చంద్రోదయ సమయానికి హస్తా నక్షత్రం కన్యా రాశిలో ఉంది దీని అధిపతి బుధుడు.

మరకతము లేక పచ్చ బుధుని రంగు కనక గణపతిని ఆకుపచ్చరంగులో ఉండే దూర్వాంకురములు ఇంకా ఆకులు (పత్రి) తో పూజిస్తారు.శత్రువులకు, నీలాపనిందలకు, రోగాలకు కారకుడైన వాడు గణపతి. ఆయనను పూజించితే వచ్చే ఏడాది వరకు సుఖంగా వుంటామని భాద్రపద శుద్ధ చవితినాడు ఈ పండుగ జరపబడుతుంది. అందుకే వినాయక చవితి కథలో సింహము చేత మరణించిన ప్రసేనుడు, నీలాపనిందలు పాలైన శ్రీకృష్ణపరమాత్ముడుకి మిత్రుడే శత్రువైన జాంబవంతునితో యుద్ధం, శతృత్వాలను ప్రమాదలను సృష్టించే శమంతకమణి కథ, ఇదే వినాయక చవితి అంత రహస్యం.

వినాయకుడు ఉండే చోట్లు

1. శబ్ద బ్రహ్మ- గణపతి ఓంకార స్వరూపుడు గా

2. యోగశాస్త్రంలో గణపతి మూలాధార స్థితుడుగా
3. మూలాధారము శక్తి స్థానము, అంటే “కుండలిని” శక్తి మూడున్నర చుట్లు చుట్టుకొని స్వరూపమున ఉన్నది సర్పిణి యైన ధరించియుండుటచే యజ్ఞోపవీతం ఎడమ భుజం మీంచి ఉండేది కాబట్టి నాగ యజ్ఞోపవీతం గలవాడిని
4. దక్షిణ హస్త గణేశుడుగా - వామహస్త గణపతి గా వర్ణించబడ్డ యోగి మూర్తి
5. మోక్షమూర్తి “విష్ణుస్వరూపి” కనుక శుక్లాంబరధరం అని అన్నారు, మోక్ష ప్రదాత విష్ణువే కదా నక్షత్రాలలో “హస్త” ముఖమున కనిపించు అంటే ఏనుగు ముఖం.

12 విశేష ప్రభావం గల గణేశుని ద్వాదశ నామాలు ఈ నామాలను పట్టించినా విద్యారంభములోను, కార్య ప్రవేశములోను, ఆపద సమయములోను, ప్రయాణ సమయంలోను, సంగ్రామ సమయంలోను, విఘ్నమూలన్ని సమూలంగా నశిస్తాయి. ఈ పవిత్ర నామోచ్చరణ వలన కార్యసిద్ధి కలుగుతుంది
పుత్రపౌత్రాభివృద్ధి, ఆయురారోగ్యైశ్వర్యాలను, చివరిగా మోక్షాన్ని కలిగిస్తుంది

1. సుముఖుడు
2. ఏకదంత
3. కపిలాయ
4. గజకర్ణికుడు
5. లంబోదరుడు
6. వికట
7. విఘ్ననాశకుడు
8. గణాధిప
9. ధూమ్రకేతుడు
10. గనాధ్యక్షుడు
11. ఫాలచంద్రుడు
12. గజాననుడు

వారాలలో మంగళవారం రోజు గణపతి పూజకు ప్రశస్తమైనదని చెప్పబడెను. మంగళుడు అంటే కుజుడు ఆయన శివపార్వతుల పుత్రుడు కనుక మంగళవారం నాడు చేసే గణపతి పూజ చాల విశేషమైనది అని గణేశ పురాణం వివరించింది చవితి తో కూడిన మంగళవారం విశేషం.
గణేశ పూజలు ప్రాపకంలో ఉన్నవి:

1. సంకష్ట హర చతుర్థి వ్రతం
2. అంగారక చతుర్థి వ్రతం (మంగళవారం తో కలిసిన చతుర్థి)
3. శ్రీ సిద్ధి గణేశ చతుర్థి వ్రతం (భాద్రపద శుద్ధ చతుర్థి)

4. శ్రీ వరద గణపతి వ్రతం
5. గణపతి పంచాయతన పూజ

గణపతికి ప్రియమైన సంఖ్య 21. 21 పత్రి సేకరించి గణేశ చతుర్థి రోజున పూజ చేయమన్నారు ఇందులోని అంతరహస్యం ఏమిటంటే

1. తులసి పత్రం (సర్వరోగ నివారిణి)
2. విష్ణుక్రాంత పత్రం (కఫ వాత, క్రిములను నశింపజేస్తుంది)
3. దేవదారు పత్రం (బెణుకు నొప్పులు, వాపులు, చర్మసంబంధమైన రోగాలు నశింపజేస్తుంది)
4. బిల్వ పత్రం (దుర్వాసన వినాశకం గా పనిచేస్తుంది)
5. దూర్వయుగ్మం (నాసిక రోగాలు రక్త సంబంధ వ్యాధులు నివారిస్తుంది)
6. శమి పత్రం (అతిసారం దంత వ్యాధులు, మూల వ్యాధులకు పని చేస్తుంది)
7. అశ్వత్థ పత్రం (జ్ఞానవృద్ధి కరం)
8. అర్జున పత్రం (వాతరోగం వినాశిని)
9. బృహతీ పత్రం (వెల్లక్కాయ పత్రం) (జ్వరము, శ్వాస, శూల,హృదయ దోషాలను హరిస్తుంది, మల బద్దకం, మూల వ్యాది, కఫం, వాతాన్నితగ్గిస్తుంది)
10. ఆర్క పత్రం (విషనాశిని)
11. సింధువార పత్రం (కృమ నాశిని)
12. మరువక పత్రం (చర్మవ్యాధి నివారణకు)
13. అపామార్గ పత్రం (చర్మరోగాలకు)
14. కరవీర పత్రం (కళ్ళకు మంచిది)
15. చూత పత్రం (అతిసార వ్యాధికి పనిచేస్తుంది)
16. బదరి పత్రం (పిల్లల రోగాలకు పనిచేస్తుంది)
17. జాజి పత్రం (నోటి దుర్వాసనకు విరుగుడు)

18. దాడివమి పత్రం (మానసిక రోగానికి పనిస్తుంది)

19. గండకి పత్రం (నేత్ర, తలనొప్పికి పనిస్తుంది)

20. మాచి పత్రం (చర్మ, నేత్ర)

21. దత్తూర పత్రం (కేశలని తిరిగి మొలిపించేది)

గణేశుడుకి ముఖ్యమైన వివిధ రూపాలు ఉన్నాయి:

1. బాల గణపతి
2. తరుణ గణపతి
3. భక్తి గణపతి
4. వీర గణపతి
5. శక్తి గణపతి
6. ద్విజ గణపతి
7. సిద్ధి గణపతి
8. ఉచ్ఛిష్ట గణపతి
9. విఘ్న గణపతి
10. క్షిప్ర గణపతి
11. హేరంబ గణపతి
12. లక్ష్మి గణపతి
13. మహా గణపతి
14. విజయ గణపతి
15. నృత్త గణపతి
16. ఊర్ధ్వ గణపతి
17. ఏకాక్షర గణపతి
18. వర గణపతి
19. త్ర్యక్షర గణపతి
20. క్షిప్ర ప్రసాద గణపతి
21. హరిద్రా గణపతి
22. ఏకదంత గణపతి
23. సృష్టి గణపతి
24. ఉద్దండ గణపతి
25. ఋణవిమోచక గణపతి
26. ఢుండి గణపతి
27. ద్విముఖ గణపతి
28. త్రిముఖ గణపతి
29. సింహ గణపతి
30. యోగ గణపతి
31. దుర్గా గణపతి
32. సంకటహర గణపతి
33. వల్లభ గణపతి
34. సిద్ధి-బుద్ధి గణపతి

కాశీలోని 56 వినాయకులు

| | |
|---|---|
| 1. అర్క గణపతి | 29. చింతామణి గణపతి |
| 2. ఉద్దండ గణపతి | 30. దంతహస్త గణపతి |
| 3. లంబోదర గణపతి | 31. పిఛిండల గణపతి |
| 4. దుర్గ గణపతి | 32. ఉద్దండముండ గణపతి |

| | |
|---|---|
| 5. భీమచండ గణపతి | 33. స్థూలదంత గణపతి |
| 6. దేహాలి గణపతి | 34. కలిప్రియ గణపతి |
| 7. పాశపాణి గణపతి | 35. చతుర్థంత గణపతి |
| 8. సిద్ధి గణపతి | 36. ద్వితుండ గణపతి |
| 9. కూతదంత గణపతి | 37. జ్యేష్ఠ గణపతి |
| 10. శ్యాలకటంగా గణపతి | 38. గజ గణపతి |
| 11. సర్వ గణపతి | 39. నాగేష్ గణపతి |
| 12. ముండ గణపతి | 40. కాళ గణపతి |
| 13. వికటదంత గణపతి | 41. మణికర్ణ గణపతి |
| 14. త్రిముఖ గణపతి | 42. చిత్రగంట గణపతి |
| 15. ప్రణవ గణపతి | 43. స్థూలజంఘు గణపతి |
| 16. రాజపుత్ర గణపతి | 44. మంగళ గణపతి |
| 17. వక్రతుండ గణపతి | 45. యోద గణపతి |
| 18. ఏకదంత గణపతి | 46. ప్రమోద గణపతి |
| 19.గజకర్ణ గణపతి | 47. సుముఖ గణపతి |
| 20. పంచాశ్వ గణపతి | 48. దుర్ముఖ గణపతి |
| 21. హేరాంబ గణపతి | 49. ఆశ గణపతి |
| 22. వింధ్యరాజు గణపతి | 50. సృష్టి గణపతి |
| 23. వరద గణపతి | 51. యజ్ఞ గణపతి |
| 24. మోదక గణపతి | 52. గణనాధ గణపతి |
| 25. అభయ గణపతి | 53. జ్ఞాన గణపతి |
| 26. సింహతుండ గణపతి | 54. ద్వార గణపతి |
| 27. కూనితాక్ష గణపతి | 55. అవిముక్త గణపతి |
| 28. క్షిప్ర ప్రసాద గణపతి | 56. కుశ్మాండ గణపతి |

❖❖❖❖❖



TELUGU ASSOCIATION INC.,SYDNEY Estd.,1992
WWW. SYDNEYTELUGU.ORG
/SYDNEYTELUGU
"Stay healthy, Stay safe Campaign."
COVID19
Support for International Students & Needy
Wear a mask if you have a cough or runny nose
See a doctor if you feel unwell
Wash hands frequently with soap
Cover your mouth with a tissue paper when coughing or sneezing
Telugu Association Sydney
FOR HEALTH SUPPORT ASSISTANCE
CONTACT
MOHAN KUMAR PARASU
0419 219 526
VISA AND IMMIGRATION SERVICES
CONTACT
MADHU BYREDDY
0425 209 397
ACCOUNTING AND TAXATION SERVICES
CONTACT
HARI KOLLURI
0425 291 032
FOOD AND GROCERY ASSISTANCE
CONTACT
MURTHY VOLETI
0402 137 475
1.5 METRE
MAINTAIN SOCIAL DISTANCING
LET'S ALL DO OUR PART
THANKS TO OUR SUPPORTING ORGANISATIONS
RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE
CENTRAL EQUITY
Apex Dental Centre
WESTMEAD DOCTORS
VINS Taxation Services
TaxNET
Venkat Kantpudi
Mortgage Broker & Tax Agent
Mobile: 0421374365
SMG Stone
SMG Stone pty ltd.
Mirch Masala
Dosa Hut
ARA VAULTS
Family Care GP
SIRI SAMPADA
SoftLabs
Rainbow Dental Practice
Dr. Shalini Sunkara
Call: 02 8021 5285
INDAUS IMMIGRATION
Swagath
Sweet UTSAV
RAY
DESIGNED BY DSLRCREW- 0403226300
AVAIL THIS FREE SUPPORT DURING THE PANDAMIC PERIOD
President: SATEESH BV RAJU Mobile: 0408469758 Email: ec@sydneytelugu.org
For Further Details Contact: Vani Motamarri 0418184111 || Raj Gunnam 0431712501
STAY HEALTHY STAY SAFE

# ఏకాదశ  గణపతి ప్రార్ధన

-శ్రీమతి లక్ష్మి గొర్తి, విశాఖపట్నం



ఆది దైవమై వెలిగే  మహిమా గణపతి

విద్యాబుద్ధులు మా కొసగె  బుద్ధి గణపతి

గరిక పూజను ప్రీతిగా గైకొనే ప్రతాప గణపతి

ధర్మ రక్షణ చేయగా వెలసిన పావన గణపతి

ధనధాన్యములు విరివిగా నొసగే లక్ష్మి గణపతి

కోరినవారికి వంశాభివృద్ధి  చేసే సంతాన గణపతి

ప్రతి పనిలోన ముందుకు నడిపి జయము చేకూర్చే విజయా గణపతి

పూజింతుము విఘ్న  గణపతి ని

కొలిచెదము సాక్షి గణపతి ని

సేవించెదము  నిక్షిప్త గణపతి ని


ప్రార్ధించెదము కరుణా గణపతి ని

వేడుకొనెదమయా  మంగళ గణపతి

వరములనిచ్చి బ్రోవవయ్యా

కాణిపాక వరసిద్ది వినాయకా!!!

❖❖❖❖❖


ARA VAULTS
SAFE DEPOSIT BOXES
SECURE YOUR VALUABLES
BULLION
JEWELLERY
DOCUMENTS
DATA
CURRENCY
WESTERN SYDNEY'S
MOST SECURE SAFE DEPOSIT BOXES
OWNED & OPERATED BY INDUSTRY EXPERTS
Our private, state-of-the-art vault is equipped with multiple layers of advanced electronic security, providing our members with both world-class security and peace of mind. Visit ARA Vaults today to learn how we can provide the most secure storage for your valuables.
PH: 02 8326 7907
aravaults.com.au

# దేశభక్తి - వచన కవితా గీతం

- కె. జయంత్ కుమార్, హైద్రాబాద్



పల్లవి :

ఆదర్శమొలికించు సైన్యమా - దేశ గళాన ముత్యమా

నీ సేవలే మాకు భాగ్యమా - కోటి వెలుగుల పుణ్యమా

భరతమాత వీర సింహమా -మాతసిగలో రత్నమా

|| ఆదర్శ ||

చరణం 1:

గతచరితము మా స్ఫురణమా - వర్తమాన భారత ఖండ రక్షణమా

రాబోయే భవ్య ప్రగతి పథమా - దేశజన జీవన సాంకేతిక గమ్యమా

దేశమాత సలిల హిమ శిఖరమా -సానుకూల కర్మబంధ ఫలితమా

|| ఆదర్శ ||

చరణం 2 :

భారత రత్నాల జీవితాదర్శమా - అమరులైనవీరచక్రాలవిలాసమా

వందేమాతర స్వీయ గానమా - అలలవోలె తెపతెపలాడే పతాకమా

దేశమాతముద్దు బిడ్డల జ్ఞాపకమా - జనగణముల వందన స్వీకారమా

|| ఆదర్శ ||

చరణం 3:

విపత్తులందు కృషిచేసే ప్రజా రక్షక దళమా -

జాతి లోనవెలుగొందే వృత్తి రత్నమా

జీవకోటి దయనుచూపే మానవతా వాదమా -

అందరిని కలుపుకునే జాతీయ నినాదామా

ప్రాంతములన్నొక్కటై -కలిసివుండే ఆధునిక సమాజమా

వివిధభాషలతోకూడిన దేశ కవితా దినోత్సవమా

|| ఆదర్శ ||

వ్యాఖ్య:

" భరతమాత కీర్తి పెంచెడి స్వతంత్ర వందనమా -

భవ్య మైన భరతజాతి దేశభక్తిని చాటూమా"

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో ....

❖❖❖❖❖



WESTMEAD
DOCTORS

## GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs



## ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

## SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

## ONSITE PATHOLOGY

**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

# పిల్లికి చెలగాటం

శ్రీ పెయ్యేటి రంగారావు,హైద్రాబాద్

చెంగయ్య మండుటెండలో తాటాకు గొడుగు కింద కూర్చుని చెప్పులు కుట్టుకుంటూ బతుకు బండి లాగిస్తున్న ఒక బడుగు జీవి. ప్రభుత్వాలు ఇళ్ళు లేని వారికి ఇళ్ళు ఇస్తామని, వడ్డీ లేకుండా ఋణాలు ఇప్పిస్తామని చాలా ప్రకటనలు చేస్తూ వుంటారు. కాని చెంగయ్యకు ఎవరిని సంప్రదించాలో, ఎలా లబ్ధి పొందాలో తెలీదు. అతడి భార్య దినసరి కూలిపనికి వెళ్ళి ఇంతో అంతో సంపాదిస్తూ వుంటుంది. వారికి ఒక మగపిల్లవాడు. అతడి పేరు కెనెడీ. అతడు పుట్టినప్పుడు ఒక ఫాదర్, అమెరికా అధ్యక్షుడంతటి వాడవుతాడు, వీడికి కెనెడీ అని పేరు పెట్టమంటే చెంగయ్య సంతోషంగా ఆ పేరే ఖాయం చేసేసాడు. తనలాగ తన కొడుకు మండుటెండలో కష్టపడకూడదని, వాడిని ఎలాగయినా మంచి చదువులు చదివించాలని చెంగయ్య దృఢంగా నిశ్చయించుకున్నాడు. అప్పటినించి మరింత కష్టపడుతూ నాలుగు రాళ్ళు కూడబెడుతూ వుండసాగాడు. అనుకున్నట్లే కెనెడీకి అయిదో ఏడు రాగానే వాడిని ప్రభుత్వపాఠశాలలో చేర్చాడు. కెనెడీ చాలా చురుకైన కుర్రాడు. ఏకసంథాగ్రాహి. ఉపాధ్యాయులు ఏమి చెప్పినా చటుక్కున గ్రహించేసే వాడు. వాడి తెలివితేటలు చూసి ఉపాధ్యాయులు కూడా అబ్బురపడి, వాడి మీద ప్రత్యేక శ్రద్ధ కనపరిచేవారు. అలా వాడు ఒక్కొక్క తరగతిని దాటుకుంటూ టెన్త్ క్లాసులోకి వచ్చాడు. వాడి ధ్యాసంతా చదువు మీదే. ఏమయినా సరే, స్టేట్ ఫస్ట్ రావాలని వాడి కోరిక. అహోరాత్రాలు కష్టపడి చదివి పరీక్షలు రాసాడు. పరీక్షా ఫలితాలు రేపు పత్రికలలో వెలువడతాయనగా, గార్గేయకళాశాల వారు వచ్చి, చెంగయ్యకు లక్షరూపాయలు ఇచ్చి, కెనెడీ ఫొటో తీసుకుని వెళ్ళారు. మర్నాడు స్టేట్ ఫస్ట్ వచ్చిన కెనెడీ తమ కళాశాలలోనే చదివాడని పూర్తి పేజి ప్రకటన అన్ని వార్తాపత్రికలలోను పడింది.

అక్కడినించి అతడి చదువు అప్రతిహతంగా సాగి, జె.ఎన్.టి.యూ. లో సీటు దొరికి, 'ట్రిపుల్ ఇ' ఇంజనీరింగ్ కోర్సులో చేరాడు. ఫైనల్ ఇయర్ చదువుతూండగా, క్యాంపస్ సెలక్షన్స్ లో సెలెక్ట్ అయి మంచి జీతంతో ఉద్యోగం వచ్చింది. చెంగయ్య, అతడి భార్య యాదమ్మ పడ్డ కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించింది. వాళ్ళు చాలా మురిసిపోయారు. ఇంకా చదువు పూర్తి కాకుండానే ఉద్యోగం ఆఫర్ రావడంతో వాళ్ళ సంతోషానికి హద్దు లేదు. చర్చికి వెళ్ళి ఏసుప్రభువుని ప్రార్థించుకుని వచ్చారు.

కెనెడీ ఫైనల్ ఇయర్ పరీక్షలు కూడా చక్కగా రాసేసాడు. ఇంక ఫలితాలు రాగానే ఉద్యోగంలో చేరడమే తరువాయి. అప్పుడు అజయ్ దేభ్యా అనే ఒక బడా పారిశ్రామిక వేత్త కారులో వారింటికి వచ్చాడు. చెంగయ్య కంగారు పడిపోయాడు, అంత కోటీశ్వరుడు మురికివాడలోని తన ఇంటికి రావడమేమిటా అని. విషయమేమిటంటే దేభ్యా తన ఒక్కగానొక్క కూతుర్ని కెనెడీకిచ్చి వివాహం చేసి ఇల్లరికం తీసుకెడతాడట. కెనెడీ ఒప్పుకోలేదు. కాని, చెంగయ్య, యాదమ్మ అతడిని శతవిధాల ఒప్పించి ఆ పెళ్ళికి అంగీకరించేలా చేసారు. అజయ్ దేభ్యా తన పలుకుబడితో అనేక బ్యాంకులకు టోపీ వేసి కోట్లు కోట్లు ఋణాలు తీసుకుని ఎగవేసిన ఘరానా మనిషి. అతడు చెంగయ్య చేతిలో ఇరవయి అయిదు లక్షలకి చెక్కు రాసి ఉంచాడు. చెంగయ్య అంత మొత్తం చేతులోకి వచ్చేసరికి, నిర్ఘాంత పడి, బిక్కమొహం వేసి 'ఏందయ్యా ఇది?' అని అడిగాడు. అజయ్ దేభ్యా చిరునవ్వు నవ్వి, 'ప్రస్తుతానికి ఇది ఉంచు చెంగయ్యా. పెళ్ళి ముందు మరొక కోటి రూపాయలు నీకు కట్నంగా ఇస్తాను.' అన్నాడు.

చెంగయ్య యాదమ్మ మొహం కేసి చూసాడు. ఆమె మొహంలో భావాలను ఇట్టే చదివాడు. ఎంతయినా యాదమ్మ తన భార్య అని ఆనందపడ్డాడు. ఆ చెక్కుని తిరిగి దేభ్యా చేతిలో పెడుతూ, 'ఏమనుకోకండయ్యా, మా బాధ్యత కనుక కష్టపడి కెనెడీని చదివించి ప్రయోజకుడిని చేసాము. అంతేగాని లాభాన్ని ఆశించి కాదయ్యా. వాడిని సంతలో పశువుని అమ్మినట్లు అమ్ముకోలేము. వాడి భవిష్యత్తుని దృష్టిలో వుంచుకుని ఈ పెళ్ళికి ఒప్పుకున్నాము. వాడు సుఖంగా వుంటే మాకంతే చాలయ్యా.' అన్నాడు కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతూండగా.

---------------------------------------------

దొంగా వీరానీ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కోట్లు  కోట్లు సంపాదిస్తున్నాడు.  అంతేకాదు, బొగ్గుగనుల కాంట్రాక్టులు, బోఫోర్స్ తుపాకుల ఏజెన్సీ, ఇంకా మరెన్నో నల్లబజారు వ్యాపారాలలో ఇబ్బడి ముబ్బడిగా కోట్లు కోట్లు సంపాదించి విదేశాలలో ఉన్న బ్యాంకులలో కాతాలు తెరిచి అక్కడికి ఈ కోట్లన్నీ తరలిస్తూ వుంటాడు.  అతడికి అన్ని పార్టీలవారితోను సత్సంబంధాలున్నాయి.  ఎన్నికలొచ్చాయంటే అన్ని పార్టీల వారికి కోట్లలో విరాళాలు కురిపిస్తూ వుంటాడు.  అందువల్ల అతడి జోలికి ఎవరూ పోరు. అతడి ఇంటినిండా, బ్యాంకు లాకర్ల నిండా బంగారం, వజ్రాలు, జమ అవుతూ వుంటాయి.  అతడికి గధా వీరానీ అన్న కొడుకు, పాజీ వీరానీ అన్న కూతురు ఉన్నారు.  వాళ్ళంటే అతడికి ఎంతో గారం.  వాళ్ళకి పాకెట్ మనీ కింద నెలకి చెరొక లక్షరూపాయలు ఇస్తూ వుంటాడు. వాళ్ళు ఏ పార్టీలకి వెళ్తూ వుంటారు, వాళ్ళ స్నేహితులెవరూ అన్న విషయాలేవీ అతడు పట్టించుకోడు.  వాళ్ళిద్దరికీ చెరొక కోటిన్నర పెట్టి మంచి లగ్జరీ కార్లు కొని ఇచ్చాడు.  వాళ్ళు సరదాగా మాత్రమే కాలేజీలకి వెళ్తూ వుంటారు.  సాయంత్రం అయ్యేసరికి స్నేహితులతో కలిసి పబ్ లకి, పార్టీలకి వెళ్తూ వుంటారు.  అక్కడ వాళ్ళకి నెమ్మదిగా డ్రగ్స్ కూడా అలవాటు అయ్యాయి.


ఆరోజు గధా వీరానీ పుట్టినరోజు.  ఇంట్లో చాలా ఘనంగా జరిగింది.  సాయంత్రం తన స్నేహితులందరికీ ఘనంగా నోవాటెల్ హోటల్ లో పార్టీ అరేంజ్ చేసాడు.  అందరూ మందు, మాంసంతో ఆనందంగా పార్టీ జరుపుకున్నారు.  ఆ రోజు గధా వీరానీ కాస్త మందు ఎక్కువగానే సేవించాడు.  పార్టీ పూర్తయినాక తన లగ్జరీ కారుని వంకర టింకరగా, విపరీతమైన వేగంతో నడుపుకుంటూ వెళ్తున్నాడు.  చూపు సరిగ్గా ఆనట్లేదు.  అయినా వేగం తగ్గించలేదు.  పొగరుగా నడుపుకుంటూ, నడుపుకుంటూ పోయి, స్టీరింగ్ మీద కంట్రోలు తప్పి, రోడ్డు పక్కన ఉన్న గుడిసెల మీదకి కారు పోనిచ్చేసాడు.  అక్కడ ఒక గుడిసె మొత్తం ఛిన్నాభిన్నమై పోయింది.  అందులో నిద్రిస్తున్న కెనెడీ మీదుగా కారు వెళ్ళడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు.  చెంగయ్యకు కాళ్ళు రెండూ తెగిపోయాయి.  యాదమ్మకు కొద్దిపాటి దెబ్బలు తగిలాయి.

మర్నాడు పోలీసులు ఆ కారుని సీజ్ చేసారు.  ఆ కారు నడిపిన వీరయ్య అనే డ్రైవర్ని అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు.  అతడి మీద కేసు నడిచి అతడికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది.  అతడు జైలు జీవితం గడిపి, బయటకు వచ్చి దొంగా వీరానీ ఇచ్చిన రెండు లక్షల రూపాయలతో జల్సా చేసుకున్నాడు.

టి.వి.లో స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి గారు సందేశం ఇస్తున్నారు.  బడుగు వర్గాల అభ్యున్నతికే మా పార్టీ కట్టుబడి వుంది.  దేశంలోని నల్లధనాన్ని మొత్తం మేము బయటికి లాగి, ఆ సొమ్ము పేదవాళ్ళందరికీ పంచి తీరతాము.  జై హింద్!, జై హింద్!! జై హింద్!!!

చెంగయ్య ఎప్పటిలా నడుచుకుంటూ కాక క్రచెస్ సాయంతో కుంటుకుంటూ పోయి తాటాకు గొడుగు కింద కూర్చుని చెప్పులు కుట్టే పని సాగిస్తున్నాడు.  అతడి భార్య యాదమ్మ ఎప్పటిలాగే దినసరి కూలి పనులకి పోసాగింది.

❖❖❖❖❖





**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

P: (02)88891383 | F: (02)86254326

**Bulk Billing**
OPEN 7 DAYS

New Medical Centre at
Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm

G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au

# కవిత్వ మంటే??

## – ఓ సగటు పాఠకుడి మనసులో మాట

-డా మూర్తి చెన్నాప్రగడ, సిడ్నీ

అంతర్జాల వేదిక పై ఈనాడు నిర్వహింపబడుతున్న ఈ తెలుగు సహితీ సదస్సు పాల్గొన విచ్చేసిన సాహితీ అభిమానులందరికి, నా హృదయపూర్వక నమస్సుమాంజలి అర్పిస్తూ స్వాగతం పలుకుతున్నాను.

నేను కవిని కానన్న వాడిని కత్తి తో పొడుస్తాను

నేను రచయితను కానన్న వాడిని రాయెత్తి కొడతాను

ఈ పంక్తులు మీలో చాల మంది గుర్తు పట్టే ఉంటారు – జంధ్యాల గారి ఒకానొక చిత్రం లో ఒక పాత్రధారి తను కవిత్వం రాస్తాను అంటూ, తన కవిత్వంలో నూతన ప్రక్రియ కి తవిక అన్న పేరు పెట్టి దాన్ని ప్రచురించమని కోరుతూ ఒక ఎడిటర్ గారికి వినిపిస్తుంది. ఆ రెండు పంక్తులు వింటే నవ్వొస్తుంది కాని అది కవిత్వమే అంటారా?? భయ పడకండి మీరు కాదు అంటే కత్తి తో పొడవను లెండి!! నా ఉద్దేశ్యం లో అది కవిత్వమే – ఎందుకంటారా? ఇది రాసిన కవి తన మనసులో ఉన్న భావన ని అంటే తాను రాయగలనన్న విషయాన్ని దృఢంగా చెప్పగోరుతూ సరళమైన పదాలతో ఒక లయబద్ధమైన రీతిలో వ్యాక్యాలని కూర్చి చెప్పడం జరిగింది. ఇది కవిత్వం యొక్క లక్షణం! పైపెచ్చు ఇన్నేళ్ళ తర్వాత కూడా మనకి తేలికగా గుర్తుండే రీతి లో ఈ పంక్తులని రాయడం జరిగింది – ఇదీ చక్కని కవిత యొక్క లక్షణమే మరి!

కవిత్వం ప్రాథమిక లక్షణాలని పరిశీలిస్తే రెండు ముఖ్యమైన అంశాల గురించి మనం మాట్లాడుకోవాలి: మొదటిది వస్తువు – అంటే కవి చెప్ప దలుచుకున్న విషయం (సబ్జెక్ట్) . ఇది మనసులో ఒక భావం కావొచ్చు, సామాజిక సమస్య కావొచ్చు, ఒక సందేశం కావొచ్చు మరేదైనా విషయం కావొచ్చు. రెండవది శిల్పం – అంటే తన మనసులో విషయాన్ని పదాలల్లో వ్యక్తీకరించే తీరు. అనగా కవిలో భావన ని పదాల ద్వారా పాఠకుడి వద్దకి మోసుకుని వెళ్ళే వాహనం అన్న మాట! ఇందుకై కవి వాడే భాష, వ్యాకరణం, చందస్సు, ఉపమానోపమేయాలు దీనిలో భాగమే.

ఆది కవి నన్నయ కాలంలో అనుసరించిన పద్ధతులకీ నేటి కవితా విధానానికి ఎంతో వ్యత్యాసం ఉంది. ఇందులో ప్రస్ఫుటంగా కనిపించే తేడా ప్రాచీన ప్రబంధ కవిత లో అనుసరించే సరళి, చందస్సు యతి ప్రాసల కున్న ప్రాముఖ్యత. ఛందోబద్ధంగా రాయబడిన కవిత్వానికి ఒక ప్రత్యేకత ఉంది. నియమాలని అనుసరించి లయ బద్ధమైన రీతి లో పదాలని చేకూర్చడం తేలిక కాదు.

ఉదాహరణకి నాకు నచ్చిన పద్యాల్లో ఒకటి:

ఇంతింతై వటుడింతై అని వామనావతారాన్ని వర్ణించిన పద్యం

ఇంతింతై వటుఁడింతయై మరియుఁ దానింతై నభోవీథిపై
 నంతై తోయద మండలాభ్రమున కల్లంతై ప్రభారాశిపై
 నంతై చంద్రుని కంతయై ధ్రువుని పైనంతై మహార్వాటిపై
 నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై

వందల సంవత్సరాల క్రితం రాసిన పద్యాలైనా నేటికీ జ్ఞాపకం ఉండటానికి కారణం కొంత ఇదే!

అలాగే నాకు నచ్చిన పోతన పద్యాల్లో మరొకటి:

బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకన్ అని ...

ఈ విధంగా పద్యాలని గుర్తు పెట్టుకోవడనికి సంగీతం లా లయ గా వినిపించే శబ్దాలు తోడ్పడతాయి.

అయితే యతి ప్రాసలు చందో నియమాలు, క్లిష్ట పదాలు, కఠిన సమాసాలు ఉంటెనే గొప్ప కవిత్వం అవుతుంది అన్న ఆలోచన కాల క్రమేణా మార్పు చెందింది. దీని తో కవిత్వ ధోరణి లో మార్పు రావడం జరిగింది. ఉదాహరణకి వేమన పద్యాలలో చందస్సు వాడినా సరళ పదాలు, వాడుక భాష ఉపయోగించడంతో సామాన్యుడికి కవితని దగ్గర తీసుకురాగలిగాడు. పై పెచ్చు సామాజిక సత్యాలని శాస్త్ర విజ్ఞానాన్ని పొందు పరిచి పద్యాలని అందించాడు.

ప్రాచీనాంధ్ర సాహిత్యం ప్రాచుర్యం సన్నగిల్లి ఆధునిక తెలుగు సాహిత్యం గా పూర్తిగా పరివర్తన చెందినది 20 వ శతాబ్దం మొదట్లో. కందుకూరి, గురజాడ వారు మున్నగు ఆధునికాంధ్ర సాహిత్య యుగకర్త ల ప్రభావం వల్ల తెలుగు సాహిత్యం, ముఖ్యంగా కవిత్వం ప్రగతి శీల రూపాన్ని సంతరించుకుంది. సాంప్రదాయ కవితా ప్రక్రియ లో ఇంకా రచనలు జరిగినా, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం ముందంజ వేయ సాగాయి. పారిశ్రామిక విప్లవం, ఉద్యమాల ప్రభావం, కొంత ఆంగ్ల సాహిత్య సంపర్కము, సామాజిక ప్రేరణ ఇలాంటి కారణాల వల్ల ఆధునిక కవిత్వం తీవ్ర పరివర్తనకి గురయ్యింది. ఈ నేపధ్యం లోనే ఆశుకవితా, అవధానం, అధివాస్తవికత లాంటి నూతన ప్రక్రియలు తెలుగు కవిత్వ ప్రపంచం లో చోటు చేసుకున్నాయి. కవిత్వానికి గ్రాంథిక భాషే అవసరం లేదు, వ్యావహారిక భాష లోనూ కవిత్వం కదం తొక్క గలదు అని నిరూపించ బడసాగింది. చివరకు పామర భాషలో కూడ నండురి వారు తమ ఎంకి పాటల్లో కవిత్వం వొలికించారు.

అయితే మరి ఆధునిక కవిత్వానికి వచనానికి పెద్ద తేడా లేనట్లేనా అని ప్రశ్నించ వచ్చు. ఈ రెంటికి మధ్య ముఖ్యమైన వ్యత్యాసం వివరణ లో ఉంది. కథలో నూ వచనంలోనూ వివరణ అవసరం ; రచయితకి కథ ద్వారా తన మనసులో విషయాన్ని విపులంగా వివరించే అవకాశం దొరుకుతుంది. కవి తన భావాన్ని వ్యక్తం చేయడనికి వాడవలిసింది క్లుప్తత! నాలుగు పేజీల్లొ రాసుకునే విషయాన్ని కవి నాలుగు పదాల్లో వ్యక్తం చేయగలగాలి! ఆధునిక కవితా ప్రక్రియల్లో హైకూ లాంటివి ఇందుకు చక్కని ఉదాహరణలు.

ఆధునిక కవిత్వం గురించి మాట్లాడుకునేప్పుడు తరచు మనం విస్మరించే మరొక్క అంశం ఉంది. అది సినిమా సాహిత్యం. భావాలని సమయానుగుణంగా సరళ సంగీత యుక్తంగా మనసుకు హత్తుకునే విధంగా రాయగలగడం సామాన్య విషయం కాదు. భువన చంద్ర గారి లాగా గువ్వల్నీ గోరింకల్నే కాక కోడి పెట్టల్ని కూడా తమ గీతాల్లో చిరంజీవులుగా చేయడం గొప్ప ప్రజ్ఞ. గీత రచయితలందరూ భేషయిన కవులే

.........వేటూరి, సిరివెన్నెల, చంద్రబోస్ , అనంత్ శ్రీరాం ... ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో - వారి

గీతాలలొ అందమైన కవిత్వం ఉట్టి పడుతూ ఉంటుంది.

అలాగని చెప్పి చేతిలో కలం ఉంది, కాగితం ఖాళీగా ఉంది కదా అని కుంటి పదాలతో విరిగిన వ్యాక్యాలు రాసేసి అదే కవిత్వం అనుకుంటే అది వెర్రితనం! కవిత్వం అన్నది వైయక్తిక సృజనాత్మకత కి ప్రమాణం ; సాధన ద్వార అభ్యాసం ద్వారా రాణింపచేయొచ్చు కాని ఆ ప్రతిభని ప్రత్యేకంగా నేర్పించలేము. ఎవరో అన్నట్టుగా కవి పుడతాడు, కవిని తయారు చేయలేము.

కవిత్వానికి క్లుప్తత ఎంత ముఖ్యమో నిర్దిష్ట రూపం కూడా అంతే ముఖ్యం. కవి తను రాసిన విషయానికి తన కవిత ద్వారా రూపాన్నందిస్తాడు.అయితే అందులో నిగూఢమైన భావం ఎల్లప్పుడూ స్పష్టం కాకపొవచ్చు. అది పాఠకుడి దృక్పథం మీద కొంత, కవి వ్యక్తపరచ దలచిన భావాన్ని అన్వయించ గలిగే శక్తి మీద ఆధారపడి ఉంటుంది. అందుకు పాఠకుడు స్వయం కవి కానక్కరలేదు - కేవలం కవిత్వం యొక్క భావాన్ని అనుభూతి చెంది ఆ రసాన్ని ఆస్వాదించగలగాలి.

విరమించే ముందు మూడు విషయలు మనవి చేసుకుంటాను:

మొదటిది - కవిత్వం అంటె ఇదె...కవిత ఫలానా విధంగానె రాయాలి అని ఉద్ఘటించడం ప్రస్తుత ప్రసంగం ఉద్దేశ్యం కాదు. కవిత్వం ఎలా రాయాలి అని చెప్ప గలిగే అర్హతలు ఏవీ లేవు నాకు, ప్రాచీన సాహిత్యం గొప్పదా సమకాలీన ఆధునిక కవిత్వం మెరుగ్గైనదా అన్న ప్రశ్నకి సమాధానం చెప్పే స్థాయి అంతకన్నా లేదు నాకు - కేవలం ఒక సాహిత్యాభిమాని గా కవితాన్వేషి గా నా మనసులో అభిప్రాయాన్ని మీతో పంచుకుంటున్నాను. వివాదాలకి విమర్శలకి దూరంగా...

రెండవది - కవిత్వం రాయడానికి నిర్దిష్టమైన నియమాలు నిబంధనలు అక్కర లేదు - అంతులేని ఆవేశం మట్టుకు కావాలి ... 'కనులంటూ ఉంటే చూసి వ్రాక్కంటూ ఉంటే రాయీ అన్నాడు శ్రీశ్రీ ; అంతర్చేతన + బాహ్యానుభవం ఉండాలి ... వీటితో పాటు భాషానుగ్రహం తోడయితే కవిత్వం తేజిల్లుతుంది! కవి తన కవిత ద్వారా వ్యక్తీకరించిన భావాన్ని అనుభూతిని పొందాలన్న ఆసక్తి ఆనందించాలన్న ఆశ పాఠకుడిలో ఉండాలి. అప్పుడే ఆ కవిత్వానికి లబ్ధి!

ఇక చివరగా ఈ సదస్సు లో పాల్గొన్న శ్రోతలందరికి, సాహిత్యాభిమానులకి , ఇటువంటి మహత్తర వేదికని సమకూర్చిన తెలుగు వాహిని కార్య నిర్వాహక బృందానికి, ముఖ్యంగా శ్రీమతి గొల్లపూడి విజయ గారికి నా ధన్యవాదాలు; ప్రత్యేకంగా ఇంతమంది సాహితీ ప్రముఖులు, హేమాహేమీ ల మధ్య నన్ను కూర్చోబెట్టి, మీతో ముచ్చటించు కోడానికి, నాకీ సదవకాశం కల్పించినందుకు మీకు నా మనః పూర్వక కృతజ్ఞతాభినందనలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటాను! నమస్కారం!



అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

# ఓ జ్యోతి కథ

-శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి, హైద్రాబాద్

అది వందన అపార్ట్ మెంట్. ఆ అపార్ట్ మెంట్లో నాలుగో అంతస్థులో, 403 నంబరు గల 2 బెడ్ రూమ్ ఫ్లాట్ లో జ్యోతి ఒక్కర్తే వుంటోంది. ఆమె ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఐదు అంతస్తులు వున్న ఆ అపార్ట్ మెంట్లో అందరికి ఎవరికే సాయం కావాలన్నా చిటికెలో చేస్తూ, ఎవరికే సమస్య వచ్చినా చిటికెలో పరిష్కరిస్తూ, ఇలా మాట సాయం, పని సాయం చేస్తూ అందరికీ తలలో నాలికలా వుంటూనే, తన చదువు తను చదువుకుంటుంది.

జ్యోతి అందరితో కలివిడిగా వుంటుంది. అందరికీ జ్యోతి అంటే చాలా ప్రేమ. జ్యోతికి అందరూ తలో రోజు వంట చేసి కేరేజి పంపుతారు వద్దన్నా వినకుండా. ' నువ్వొక్కదానివి ఏం వండుకుంటావమ్మా? మాకెవరికీ నువ్వు బరువు కాదు. నువ్వు మా ఇంటి జ్యోతివి.' అంటూ ఆమెని ఎంతో ప్రేమగా చూస్తారు.

ఆదివారాలు మాత్రం జ్యోతి వృద్ధాశ్రమాలకి వెళ్ళి, అక్కడ అందరికి పళ్ళు ఇస్తుంది. అందర్నీ ఆత్మీయంగా పలకరిస్తుంది. వాళ్ళచేత కథలు చెప్పించుకుంటుంది. వాళ్ళు చెప్పే పాతకాలం కథలు, పాతకాలం విషయాలు, పాతకాలం వంటలు అడిగి తెలుసుకుని వాయిస్ రికార్డులో రికార్డు చేస్తుంది. వాళ్ళు నిరాశ చెందకుండా కబుర్లు చెబుతూ ఉత్సాహపరుస్తుంది. వాళ్ళకి కూడా జ్యోతి రాగానే కళ్ళలో ఆనందం తొణికిసలాడుతుంది. ఓపిక వున్నంత వరకు ఏదో పని చెయ్యాలంటుంది. 'మెదడుని, శరీరాన్ని ఖాళీగా వుంచితే, మెదడులో పిచ్చి ఆలోచనలు వచ్చి, నిరాశ, నిస్పృహ ఏర్పడతాయి. శరీరానికి శ్రమ లేకపోతే సోమరితనం అలవాటు అవుతుంది' అంటూ ఏదో పని చేయిస్తుంది.

అందుకే కొంత లోను తీసుకుని, ' అమ్మమ్మ హోటల్ ' అని పెట్టించింది. అమ్మమ్మ హోటల్ లో పాతకాలం వంటలు, పిండివంటలు, పచ్చళ్ళు, పులిహోర, అరిసెలు, బూరెలు, ఇడ్లీ, దోశ, అన్నీ వుంటాయి. పిండివంటలు ఆర్డర్లమీద చేస్తారు. అన్నీ రుచిగాను, శుచిగాను వుంటాయి. హోటల్ మెల్లమెల్లగా పుంజుకుంటోంది.

ఆప్యాయతకి మారుపేరు అమ్మమ్మ హోటల్. ఆ బోర్డు అందర్నీ ఆకర్షిస్తుంది. విపరీతంగా జనం వస్తున్నారు.

నిజంగానే వచ్చినవాళ్ళకి ఆప్యాయంగా భోజనం, టిఫిన్లు పెడతారు. అక్కడుండే వాళ్ళు వయసు మళ్ళినవాళ్ళే కాబట్టి, కన్నబిడ్డలకి పెట్టినట్టు పెడతారు. కొడుకులు, కోడళ్ళు తరిమేసి, అనాథాశ్రమంలో చేర్చిన వృద్ధమహిళామణులు వాళ్ళందరూ. మరీ లేవలేని వాళ్ళు కాదు. ఒకరికొకరు సాయంగా, ఒకరికి ఒంట్లో బాగుండకపోతే మరొకరు, ఇలా చేస్తారు. ఒకరోజు ఒకళ్ళు రెస్టు తీసుకుంటే, మర్నాడు మరొకరు, ఇలా చేస్తారు. ఒక్క ఆదివారం ఆ హోటల్ కి శలవు. ఆ రోజు జ్యోతి వచ్చి అందరికీ మెడికల్ చెకప్ చేయిస్తుంది. అందరిచేత వాళ్ళకి వచ్చిన ఆటలు ఆడిస్తుంది. కేరమ్స్, చింతగింజలు, వైకుంఠపాళి, ఇలా కూచుని ఆడే ఆటలు. వాళ్ళు కూడా వాళ్ళు పడిన కష్టాలు, బాధలు అన్నీ మర్చిపోయి, జ్యోతి చెప్పిన ఆటలు ఆడతారు.

జ్యోతి అక్కడ అందర్నీ అమ్మా అనో, అమ్మమ్మా అనో, తనకి నచ్చిన విధంగా పిలుస్తూవుంటుంది. ఇంక ఆ ఆదివారం వాళ్లతో కాలక్షేపం చేసి, సాయంత్రం ఇంటికి వెళ్ళబోతుండగా కారులోంచి ఒకామెని ఆమె కొడుకు, కోడలు వృద్ధాశ్రమంలో చేర్చడానికి తీసుకొచ్చారు. ఆవిడ మరీ అంత ముసలామె కాకపోయినా, సరైన తిండి లేక చాలా బలహీనంగా వుందనిపించింది. కాని ఆ తల్లిని లోపలికంటా తీసుకొచ్చి, ఆశ్రమం యాజమాన్యంతో మాట్లాడకుండా, ఆమెని అక్కడే దింపేసి, బట్టలపెట్టె, అదీ అక్కడ పెట్టేసి వెళిపోయారు. కాని ఆశ్రమంలో ఎక్కడా ఖాళీ లేదు.

జ్యోతి వివరాలు అడిగింది.

కొడుకు, కోడలు, ఒక మనవడు, మనవరాలు అమెరికాలో వుంటారు. తల్లి ఒక్కత్తే స్వంత ఇంట్లో వుంటుంది. అమెరికాలో వాళ్ళకి మనిషి అవసరం వచ్చింది. తల్లిని తీసికెళ్ళి అడ్డమైన చాకిరీలు చేయించుకున్నారు. పనిమనిషికి పెట్టినట్టు ఇంత తిండి పెట్టేవారు. పళ్ళు, అవి వాళ్ళే తినేవాళ్ళు. ఒంట్లో బాగుండకపోయినా, ఆ దేశంలో వైద్యం చాలా కష్టం. డాక్టర్లు ఎలా పడితే అలా, ఎప్పుడు పడితే అప్పుడు మందులివ్వరు.

ఇంక చెయ్యలేని పరిస్థితుల్లో, ఆ తల్లిని వదిలించుకోడానికి ఇండియా వచ్చి, తల్లి చేత సంతకాలు పెట్టించి, ఆ యిల్లు అమ్మేసారు. అందుకే, ఆవిడ అవసరం ఇంక లేదులే అనుకుని, అనవసరంగా తిండి దండగ, వైద్యానికి కూడా ఖర్చు పెట్టాల్సి వస్తుందని అమెరికా వెళిపోతూ వృద్ధాశ్రమం దగ్గిర వదిలేసి వెళిపోయారు.

జ్యోతి ఇంటికి వెళిపోతూ, ' నాతో రా, అమ్మమ్మా. నిన్ను నేను పెంచుకుంటాను. జాగ్రత్తగా చూసుకుంటాను.' అంటూ పార్వతమ్మని తన ఇంటికి తీసుకు వచ్చింది.

జ్యోతిని చూడగానే ఆ అపార్ట్ మెంట్లో అందరికీ ఆనందం కలిగింది. కూడా వస్తున్న ఆ పెద్దావిడని చూసి, ' ఆమె ఎవరు?' అని అడిగారు అందరూ.

జ్యోతి ఏం సమాధానం చెప్పకుండా ఆవిడని ఇంట్లోకి తీసికెళ్ళింది. మంచినీళ్ళిచ్చి, ఫ్రిజ్ లోంచి పళ్ళు కోసి పెట్టింది. స్నానం చేయమంది. మంచం మీద పడుకుని విశ్రాంతి తీసుకోమంది.

' ఎవరు బంగారుతల్లీ నువ్వు? నన్నింత ప్రేమగా తీసుకొచ్చి సపర్యలు చేస్తున్నావు?' అడిగింది పార్వతమ్మ.

ముందర నువ్వు విశ్రాంతి తీసుకో అమ్మమ్మా. నేనెవరో తరవాత చెబుతాను. చాలా బలహీనంగా వున్నావు. ముందర ముందర నా గురించి నీకే తెలుస్తుందిలే.' అంటూ జ్యోతి స్నానం చేసి దేవుడికి దీపం పెట్టి, పళ్ళు నైవేద్యం పెట్టింది. కాలేజికి వెళ్ళడానికి తయారైంది. ఐదో అంతస్థులో, 504 నంబరు ఫ్లాటులో వుండే సుందరంగారి అమ్మాయి లత వచ్చింది. ఇద్దరూ కలిసి ఆటోలో కాలేజికి వెడతారు. లత కేరేజి తెచ్చింది. మంచం మీద పడుకున్న పెద్దావిడ్ని చూసి ' ఎవరే ఆవిడ?' అని అడిగింది.

' నేను పెంచుకుంటున్నానే ఆవిడని. అమ్మమ్మగా దత్తత తీసుకున్నాను.'

లత ఇంకేం అడగలేకపోయింది. ఎంత స్నేహితురాలైనా జ్యోతిని వివరాలు ఆడగటానికి భయమేసింది. లతకే కాదు, జ్యోతి అంటే అక్కడ అందరికి ఎంత ప్రేమాభిమానాలున్నా, జ్యోతి వివరాలు అడగటానికి భయమే.

' లతా! ఇంకెవరూ నాకు కేరేజిలు పంపవద్దే. ఇంట్లో నేనే వంట చేస్తాను. లేకపోతే మా అమ్మమ్మ చేస్తుంది కొంచెం కోలుకున్నాక.'

' అదేమిటే జ్యోతీ! ఈ అపార్ట్ మెంట్లో ఎవ్వరం నిన్ను పరాయిదాన్నిగా చూడటల్లేదు. నువ్విలా మాట్లాడుతున్నావేమిటి?'

' నే చెప్పింది విను. అంతే. కేరేజి పంపవద్దు.'

లతేం మాట్లాడ లేదు.

' అమ్మమ్మా! మజ్జిగ అన్నం కలిపాను. ముందర ఇది తిను. నీరసం తగ్గుతుంది. నువ్వు కోలుకున్నాక నీకు కావలసిన విధంగా తినవచ్చు. నీకు ఒంట్లో బాగుండకపోతే చెప్పు. ఈ అపార్ట్ మెంట్లోనే ఈశ్వర్ అని ఓ డాక్టరంకుల్ వున్నాడు. చెకప్ చేసి మందులు రాసిస్తాడు. నేను కాలేజికి వెడుతున్నా. సాయంత్రం వస్తా. రామాయణం, భారతం, భగవద్గీత పుస్తకాలు పక్క టీపాయ్ మీద వున్నాయి. చదువుకో. ఎవరన్నా వస్తే ఏం చెప్పకు. నే సాయంత్రం వస్తా.' అంటూ లతతో లిఫ్టులో కిందకి దిగి కాలేజికి వెళిపోయింది. సాయంత్రం నాలుగు గంటలకి ఇంటికి వచ్చేసరికి అమ్మమ్మ ఎవరితోనో బాతాఖానీ వేస్తోంది.

' అమ్మమ్మా! పనిలేకుండా ఊరికే కూచుని, చుట్టుపక్కల వాళ్ళందరితో వేసే బాతాఖానీలు నాకు నచ్చవు. ఒంట్లో బాగుంటే ఏదో ఒక వ్యాపకం పెట్టుకుని పని చెయ్యి. బాగుండకపోతే దేవుడి ధ్యానం చెయ్యి.' అంది.

కాఫీ కలిపి ఇచ్చి తనూ తాగింది. కాసేపయాక టెన్త్ వాళ్ళకి, నైన్త్ వాళ్ళకి, ఎయిత్ వాళ్ళకి ట్యూషన్లు చెప్పింది. కాలేజి నించి వచ్చాక రోజూ పిల్లలకి ట్యూషన్లు చెబుతుంది. ట్యూషన్లయ్యాక అడిగింది, ' అమ్మమ్మా! రాత్రి నువ్వేం తింటావు? అన్నమా, చపాతీలా?'

అమ్మమ్మ ఏదో చెప్పబోయేంతలో, ' అమ్మమ్మా! నిన్ను కించ పరచాలనే ఉద్దేశ్యంతో నేననలేదు బాతాఖానీ వేస్తున్నావని. వాళ్ళు నిన్ను ఏవో ఆరాలడుగుతున్నారని తెలిసే వాళ్ళననలేక నీకు చెప్పాను. ఏమనుకోకు అమ్మమ్మా! నువ్వు నా మనిషివని చెప్పాను.'

అమ్మమ్మ ఆశ్చర్యపోయింది తన మనసులో విషయం చెప్పకుండానే పసిగట్టి, దానికి సమాధానం చెప్పిన విధానానికి.

' లేదమ్మా బంగారూ! నువ్వు తప్ప నాకెవరున్నారు? సరే, నాక్కొంచెం ఓపిక వచ్చింది. నేనే చేస్తాలే అమ్మా చపాతీలు.' అంటూ ఐదునిమిషాల్లో కూర, చపాతీలు రెడీ చేసింది.

' అమ్మమ్మా! చాలా బాగా చేసావు.' అంది.

రోజూ వంట, రాత్రి చపాతీలు అమ్మమ్మే చేస్తోంది.

అపార్ట్ మెంట్లో 201 ఫ్లాట్ లో గంగాధర్ లాయరు కూతురు శ్రావణికి పెళ్ళి నిశ్చయమైంది. నిశ్చితార్థానికి అందర్నీ పిలిచారు. అపార్ట్ మెంటు సెల్లార్ లో పెద్దఫంక్షను హాలుంది. అక్కడ డిన్నర్ ఏర్పాటు చేసారు.

అమ్మమ్మ హోటల్ నించి డిన్నర్ ఆర్డర్ చేసారు. పులిహోర, మైసూర్ పాక్, గోంగూరపచ్చడి, బొబ్బట్లు, క్యాబేజి పులిహోర కూర, గుత్తివంకాయ కూర, అరటికాయ బజ్జీలు అన్నీ బాగున్నాయని అందరూ చాలా మెచ్చుకున్నారు.

ఉన్నట్లుండి శాంతమ్మని అడిగిందొకావిడ. ' శాంతమ్మా! నువ్వు అమెరికా కొడుకు, కోడలు దగ్గిరకెళిపోయావు కదా? ఎప్పుడొచ్చావు? అమెరికా ఎలా వుంది? మళ్ళీ ఎప్పుడెళతావు? ఇక్కడే వుంటావా? ఇల్లు అమ్మేసారట కదా? మేం బొంబాయిలో వుంటున్నాం. పెళ్ళికొడుకు మా అక్క తోటికోడలు కొడుకు. నువ్వు ఎవరి తరఫు? ఆడపెళ్ళివారి తరఫా, మగపెళ్ళివారి తరఫా?' గడగడా ప్రశ్నల వర్షం కురిపించేసింది.

మీనాక్షమ్మ, శాంతమ్మ పక్క పక్క ఇళ్ళలో వుండేవాళ్ళు. తరవాత కొడుకు పెళ్ళయాక మీనాక్షమ్మ బొంబాయి వెళిపోయింది. ఇదుగో పెళ్ళికొడుకు అమెరికాలో వుంటాడు, అంటూ చెబుతుంటే, జ్యోతి చూసి గుర్తుపట్టింది అతన్ని. వెంటనే గంగాధర్ గారి దగ్గరకెళ్ళి అతనెవరో చెప్పింది. అది విని కోపంతో ఊగిపోతూ వెంటనే తాంబూలాలు ఆపుచేయించారు.

' ఏమిటి, ఏమయింది బావగారూ?' అన్నాడు అబ్బాయి తండ్రి.

'అమెరికాలో ఉద్యోగం చేస్తున్నట్లు, పదిరోజుల్లో పెళ్ళి జరిగిపోవాలని చెప్పి, పది లక్షలు కట్నం తీసుకుని పారిపోదామనుకున్నారా? వృద్ధాశ్రమంలో వాచ్ మెన్ గా చేస్తూ, అబద్ధాలాడి నా కూతురి మెళ్ళో తాళి కడదామని చూస్తారా? వెంటనే వెళిపోండి ముందర.' అంటూ వాళ్ళమీద అరిచాడు.

పెళ్ళికూతురు స్వప్న, తల్లి సుందరి ఏడవడం మొదలుపెట్టారు. జ్యోతి ఓదార్చింది. ' ఊరుకో స్వప్నా! పెళ్ళి దాకా రాలేదు, సంతోషించండి. మీకు ఇంకో మంచి సంబంధం దొరుకుతుంది. నాకు తెలిసింది కాబట్టి చెప్పాను. మీరు అమెరికా సంబంధం అన్నారు కదా, ఇదేమిటి? వీళ్ళతో సంబంధమేమిటి అనుకున్నాను. ఈ తండ్రీ కొడుకులు వృద్ధాశ్రమం దగ్గర వాచ్ మెన్ లుగా చేసేవారు. వాళ్ళు సరిగా చెయ్యటల్లేదని తీసేసి ఇంకొకళ్ళని మాట్లాడుకున్నారు. ఈ విషయాలన్నీ నాకు తెలిసుండీ మౌనంగా ఊరుకోలేక గంగాధర్ అంకుల్ కి చెప్పేసాను.'

' అమ్మా జ్యోతీ! నువ్వు మా యింటి జ్యోతివమ్మా. నా కన్నకూతురు జీవితాన్ని రక్షించావు. నువ్వు రానంటే, ఆశ్రమంలో ఎవరికో ఒంట్లో బాగుండలేదని వెళతానంటే, నిన్ను బలవంతపెట్టి ఫంక్షనుకి రమ్మన్నాము. నువ్వు రాకపోతే కనక ఆ మోసగాడితో నా కూతురుకి పెళ్ళి అయిపోయి వుండేది. ఏ తల్లి కన్నబిడ్డవో, ఈ అపార్ట్ మెంట్ లో మేం వున్నప్పట్నించి, అందరికీ ఎంతో ఆత్మీయంగా సాయంగా వుంటున్నావు.' అంటూ ఎంతో కొనియాడారు.

మర్నాడు ఆదివారం అమ్మమ్మ బోర్నవిటా కలిపి ఇచ్చింది.

' ఎందుకమ్మమ్మా? నేను కలిపేదాన్నిగా?'

' వంట ఏం చెయ్యమంటావు బంగారూ?' జ్యోతిని బంగారూ అని పిలుస్తుంది శాంతమ్మ.

' ఇవాళ నాకేం వద్దు. నువ్వే ఏదో చేసుకు తిను. ఈరోజు వృద్ధాశ్రమానికి వెళ్ళి వాళ్ళ యోగక్షేమాలు కనుక్కోవాలి. నేను వెళ్ళడం కొంచెం ఆలశ్యమైతే వాళ్ళు బాధపడతారు నాకేమైందోనని. ఏం తినకుండా నాకోసం ఎదురు చూస్తూవుంటారు. అదిగో, ఆటో వచ్చింది, వస్తా అమ్మమ్మా.' అంటూ అపార్ట్ మెంట్లో కనబడిన వాళ్ళందర్నీ పలకరిస్తూ ఆటో ఎక్కింది జ్యోతి. కాని ఎప్పుడూ ఎక్కే ఆటో కాక, అతనికి ఒంట్లో బాగాలేదని, నన్ను పంపాడని మరొకతను చెబుతే, అతడి ఆటో ఎక్కింది.

ఆ ఆటో ఎటో వెళ్ళిపోతోంది.

రాత్రి కరక్టుగా ఏడుగంటలకల్లా వందనా అపార్ట్ మెంట్స్ కి చేరుకునే జ్యోతి ఇంకా రాలేదు. ఎక్కడికెళ్ళినా వెళ్ళేటప్పుడు, వచ్చాక అందరికీ కనిపించి, పలకరించే జ్యోతి ఏడుగంటలు దాటినా రాకపోయేసరికి అందరూ కంగారు పడ్డారు. ఒకవేళ ఆశ్రమంలోనే వుండిపోయిందేమో అని ఆశ్రమానికి వెళ్ళి కనుక్కున్నారు. అక్కడ పొద్దుట్నించీ ఆమె కోసమే ఎదురు చూస్తున్నామని, కాని ఆమె ఇవాళ అసలు ఇక్కడికి రాలేదని చెప్పారు. తరవాత పోలీసు రిపోర్టు ఇచ్చారు.

నాలుగురోజుల తర్వాత జ్యోతి శవం ఒక పొదల్లో కనిపించింది. తిరిగిరాని లోకాలకి వెళిపోయిన జ్యోతి గురించి అందరూ కన్నీరు, మున్నీరై ఏడిచారు. అమ్మమ్మ, ' బంగారూ! బంగారూ!' అంటూ ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది.

సుందరి ఏడ్చింది, ' అమ్మా జ్యోతీ! నా కూతురు జీవితాన్ని రక్షించినదానివి, నువ్వు బలైపోయావా తల్లీ?

వృద్ధాశ్రమంలో ఎవరికీ చెప్పలేదు అందరూ జ్యోతి గురించి ఎదురు చూస్తూనేవున్నారు.

ఒకాయన వచ్చి, ' అమ్మా జ్యోతీ! నువు కూడా అమ్మ, నాన్నల దగ్గిరకి వెళిపోయావా తల్లీ? మీ అమ్మా, నాన్నా కేదార్ నాథ్ యాత్రలో చనిపోయారు. అప్పుడు నీ టెన్త్ పరీక్షలవుతున్న మూలాన నీకు చెప్పలేదు. నీకు ఏం చెప్పకుండా నీకు ధైర్యం నూరిపోస్తూ వస్తున్నాను. కష్టాలొస్తే ఎలా బతకాలో నీకు అనుక్షణం నూరిపోస్తూ వస్తున్నాను. నీ గురించి అందరూ ఎంతో బాగా చెబుతుంటే పొంగిపోయాను. అందరి జీవితాల్లో జ్యోతులు వెలిగించి, నువ్వెళ్ళిపోయావా తల్లీ?' అంటూ బాధపడ్డాడు.

అందరి జీవితాల్లో ఆనందపు వెలుగులు నింపిన జ్యోతి ఆరిపోయింది.!

❖❖❖❖❖



# కామేశ్వరి



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra times are finishing and Varjyam times are start to finish - Standard or Daylight Saving Time (AEST/NZDT) as applicable in Australia.

## ఆగష్టు 2020

శ్రీ శార్వరి శ్రావణ శు త్రయోదశి నుండి భాద్రపద శు త్రయోదశి వరకు

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిధి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

పంచాంగ కర్తలు: నేతి శివరామకృష్ణ శాస్త్రి (సిడ్నీ) & కర్రా భాస్కర శర్మ (మెల్బోర్న్)

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆది**<br>రా - 16:30 to 18:30 | **30**<br>శు ద్వాదశి 12:46<br>ఉత్తరాషాఢ 18:23<br>వ 1:48 - 3:27<br>వ 22:35 - 0:16 | **2**<br>శు త్రయోదశి 2:21<br>పూర్వాషాఢ 11:18<br>వ 19:28 - 21:6 | **9**<br>బ పంచమి 8:44<br>రేవతి 23:38<br>వ 10:9 - 11:57 | **16**<br>బ ద్వాదశి 18:19<br>ఆరుద్ర 11:34<br>వ 23:24 - 0:59 | **23**<br>శు చవితి 0:24<br>శు పంచమి 21:26<br>చిత్ర 21:32<br>వ 6:58 - 8:26 |
| **సోమ**<br>రా - 7:30 to 9:30 | **31** భాద్రపద<br>శు త్రయోదశి 13:15<br>శ్రవణం 19:32<br>వ 23:48 - 1:30 | **3**●<br>శు చతుర్దశి 1:55<br>ఉత్తరాషాఢ 11:49<br>వ 15:57 - 17:36 | **10**<br>బ షష్ఠి 11: 8<br>అశ్విని పూర్తి<br>వ 22:4 - 23:52 | **17**<br>బ త్రయోదశి 17:0<br>పునర్వసు 11:14<br>వ 18:53 - 20:25 | **24**<br>శు షష్ఠి 18:53<br>స్వాతి 19:51<br>వ 2:45 - 4:14 |
| **మంగళ**<br>రా - 15:00 to 16:30 | | **4**<br>శు పూర్ణిమ 1:51<br>శ్రవణం 12:38<br>వ 16:51 - 18:32 | **11**<br>బ సప్తమి 13:31<br>అశ్విని 2:33<br>వ 13:16 - 15:3 | **18**<br>బ చతుర్దశి 15:4<br>పుష్యమి 10:11<br>వ 22:11 - 23:41 | **25**<br>శు సప్తమి 16:43<br>విశాఖ 18:26<br>వ 1:7 - 2:37<br>వ 22:16 - 23:49 |
| **బుధ**<br>రా - 12:00 to 13:30 | Festivals & Holidays<br>15 – Independence Day<br>22 – Vinayaka Chavti | **5**<br>బ పాడ్యమి 2:21<br>ధనిష్ఠ 13:56<br>వ 21:42 - 23:25 | **12**<br>బ అష్టమి 15:35<br>భరణి 5:20<br>వ 18:38 - 20:24 | **19**●<br>బ అమావాస్య 12:37<br>ఆశ్లేష 8:41<br>వ 19:39 - 21:7 | **26**<br>శు అష్టమి 15:5<br>అనురాధ 17:29<br>వ 23:0 - 0:34 |
| **లక్ష్మి**<br>రా - 13:30 to 15:00 | Sydney<br>Sun Rise Set<br>1 6:48 17:14<br>8 6:42 17:19<br>15 6:34 17:24<br>22 6:26 17:29<br>29 6:18 17:34 | **6**<br>బ విదియ 3:11<br>శతభిషం 15:49<br>వ 22:49 - 0:34 | **13**<br>బ నవమి 17:21<br>కృత్తిక 7:55<br>వర్జ్యం లేదు | **20** భాద్రపద<br>శు పాడ్యమి 9:48<br>మఖ 6:38<br>వ 13:52 - 15:19 | **27**<br>శు నవమి 13:46<br>జ్యేష్ఠ 17:7<br>వర్జ్యం లేదు |
| **శుక్ర**<br>రా - 10:30 to 12:00 | Melbourne<br>Sun Rise Set<br>1 7:20 17:33<br>8 7:13 17:39<br>15 7:05 17:45<br>22 6:56 17:50<br>29 6:46 17:56 | **7**<br>బ తదియ 4:42<br>పూర్వాభాద్ర 18:3<br>వర్జ్యం లేదు | **14**<br>బ దశమి 18:25<br>రోహిణి 9:49<br>వ 1:11 - 2:55<br>వ 15:42 - 17:23 | **21**<br>శు విదియ 6:39<br>పుబ్బ 4:20<br>వ 10:50 - 12:17 | **28**<br>శు దశమి 13:1<br>మూల 17:6<br>వ 15:30 - 17:6 |
| **శని**<br>రా - 09:00 to 10:30 | **1** శ్రావణ<br>శు ద్వాదశి 3:9<br>శు త్రయోదశి 2:21<br>మూల 11:18<br>వ 9:43 - 11:18<br>వ 20:54 - 22:30 | **8**<br>బ చవితి 6:31<br>ఉత్తరాభాద్ర 20:40<br>వ 4:42 - 6:28 | **15**<br>బ ఏకాదశి 18:47<br>మృగశిర 11:1<br>వ 19:37 - 21:15 | **22**<br>శు తదియ 3:26<br>ఉత్తర 2:1<br>హస్త 23:41<br>వ 9:36 - 11:3 | **29**<br>శు ఏకాదశి 12:39<br>పూర్వాషాఢ 17:30<br>వ 2:51 - 4:29 |

# అక్షరాల తొలగింపు - తెలుగు ప్రాచీన సాహిత్యము పై వేటు

-శ్రీ ఉమామహేశ్ శనగవరపు, మెల్బోర్న్, ఆస్ట్రేలియా

భాషా మరణం అంటే క్రమ క్రమంగా భాష కనుమరుగవడం. ఇది అనేక రకాలుగా జరగ వచ్చు. ఉదాహరణకు-

1. ఆర్థిక ప్రయోజనాలు లేక క్రమ క్రమంగా మాతృ భాష క్షీణించడం

2. ప్రత్యేక సమయాల్లో తప్ప భాషను ఉపయోగించక పోవడం.

3. అధికారంలో ఉన్న ప్రభుత్వము , మతాధికారుల విధానాల వలన మాతృ భాషా మరణం

4. వ్యక్తిగత స్థాయిలో భాష పై పట్టు క్రమంగా తగ్గడం వలన ఏర్పడే మాతృ భాషా విముఖత

5. పదకోశాల , మాండలికాలకు పరిరక్షణ లోపించడం - డిఫెక్టివ్ ఆర్థోగ్రఫీ లో డిక్షనరీల తయారీ

**ప్రాచీన సాహిత్యము పై వేటు కి కారణాలేమిటి ?**

ప్రాచీన ఛందో ప్రక్రియలను నేర్వడం సృజనాత్మకతకు , మేధస్సుకు మంచిది. నేటి కాలంలో మన భుక్తి కోసం నేర్చుకొనే అశాస్త్రీయమైన ఆంగ్ల స్పెల్లింగ్స్ కన్నా మన ఛందస్సులో పద్యమల్లడము కష్టమేమీ కాదు. కానీ ఈ ప్రక్రియల అవసరం, వాటిని సులభముగా నేర్పే ఉపకరణాలు, విధానాలు, నేటి వేగవంతమైన జీవనములో కొరవడ్డాయనడము నిర్వివాదాంశము. ఆధునిక సాహిత్యము , వ్యాసము మొదలైన ఇతర ప్రక్రియలు సులభముగా ప్రారంభించడానికి అనువైనవి. అయినప్పటికీ ఆధునిక సాహిత్యాన్ని మాత్రమే ఆదరించి, ప్రాచీన ప్రక్రియలను దూరంచేస్తే అది భాషా హత్య (లింగ్విసైడ్) యే అవుతుంది.

భాషను మనిషి యొక్క భావజాలం/ఇజం లేదా మతం , వర్గ ద్వేషం, రాజకీయ రంగులకు అతీతంగా ఉంచవచ్చు, అపుడు అది భాషా వైవిధ్యతకు సామరస్యానికి అనువుగా ఉంటుంది. కానీ భావజాలం/ఇజం లేదా మతం , వర్గ ద్వేషం, రాజకీయ ప్రాబల్యం వలన సంఘర్షణలు ఏర్పడి, మతం, రాజకీయం, ఇజం, వ్యాపారాల ప్రభావం వలన ప్రాచీన సాహిత్యానికి హాని అధికంగా ఉంటుంది.

**అక్షరాలు భావ జాలాలకు అతీతమైనవి**

భాష , పద కోశాలలో భావ జాలం కనిపించినా అక్షరాలు మాత్రం వీటికి ఎల్లప్పుడూ అతీతమైనవే. . సినిమా హాలు అన్ని రకాల బహుముఖమైన సౌకర్యాలు కలిగి ఉన్నపుడు మంచి ఏఫెక్ట్స్ ఉన్న సినిమానూ వేయ వచ్చు, సాధారణమైన సినిమా ప్రదర్శించ వచ్చు. నా సినిమా ఎపుడూ సాధారణమైనదే అని థియేటర్ సౌకర్యాలను కుదింపు చేసినా సమస్యే, కేవలం గొప్ప సినిమాలు మాత్రమే ప్రదర్శించాలన్నపుడూ

సమస్యే. మన అక్షర వ్యవస్థ అన్ని సౌకర్యాలున్న సినిమా థియేటర్ లాంటిదయితే సాహిత్యమొక సినిమా. మనం ఈ గొప్ప సినిమా హాల్లో జానపద సాహిత్యపు సినిమా ప్రదర్శించవచ్చూ ,వైదిక సాహిత్యమూ ప్రదర్శించనూవచ్చు. ఆధునిక వచనమూ నడిపించచ్చు, ప్రాచీన పద్యమూ ఆడించచ్చు. దేనికైనా ఎక్కువ అక్షరాలు కావాలి. ఎక్కువ అక్షర సంపద కలిగిన ఉన్నపుడే భాషా వైవిధ్యత సాధ్యము. ఎన్ని ఎక్కువ అక్షరాలుంటే అంతగా భాషా వైవిధ్యతకు పట్టం కట్టవచ్చు.

**ఆడలేక మద్దెల ఓడు-అక్షరాల తొలగింపు - ఒక భాషా హత్య**

అక్షరముల్లో ఉన్న రహస్యాలు, అక్షరములను సులభంగా శాస్త్రీయంగా నేర్పించడము తెలియనపుడు అవి గుదిబండలుగా కనపడుతాయి. ఆడలేక మద్దెల ఓడన్నట్టు, వెంటనే అక్షరములను అవసరములేనివని మనమే ఊహించుకొని తొలగించడము జరుగుతుంది. ఋ,ౠ, ఌ, చే, జే ళ , అర సున్న, విసర్గ, ఙ, ఞ, లను కనీసము విద్యాలయాల్లో నేర్పించడానికి అనుమతి ఇవ్వక పోవడము వలన, లేదా వాటి వాడకం తగ్గించే ప్రయత్నం వలన 2000 సంవత్సరముల తెలుగు సాహిత్యం తరువాత తరం వారికి అవసరంలేదు అనే నిర్ణయాన్ని రుద్దినట్లవుతుంది. క్రమముగా నేర్పడము కష్టమైనపుడు లేదా సమాచారము లుప్తమైనపుడు భాషా హాని జరుగుతుంది.

ఆపైన తరువాతి తరం వారు 2000 సంవత్సరముల భాషా చరిత్ర వారికి చెందినది కాదని అభిప్రాయపడి ఆత్మన్యూనత పొందే అవకాశమెక్కువ.

❖❖❖❖❖




తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు గారి 157 వ జయంతి రోజు తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

❖❖❖❖❖


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

# నండూరివారి ఊహాలోకంలో తెలుగింటి ఎంకి, నాయుడు బావ

-శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ




నండూరివారి ఊహాలోకం నుంచి సృష్టించబడిన పల్లెటూరి పడుచు ఎంకి,తోడుగా నాయుడు బావ. తెలుగువారి హృదయాలలో ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. పల్లెటురి వాతావరణం అంటే ఒకరకమైన యాస, పిల్ల గాలి, జల జల పారే సెలయేర్లు,చక్కని మట్టి వాసన,స్వచ్ఛత ఇవి మనకు గుర్తుకు వస్తాయి.

అటువంటి పరిసరాలలో ఏ కల్మషం తెలియని అమాయకపు ముగ్ధ నండూరి వారి ఎంకి నాయుడుబావతో తిరుగాడుతూ వారి మధ్య చిగురించిన ప్రణయ భావుకతను నండురి వెంకట సుబ్బారావు గారు పాటలరూపంలో తెలుగు భాషలో సమకూర్చటం తెలుగు వారు చేసుకున్న అదృష్టం.

ఆంగ్లంలో దీనినే రొమేంటిక్ పొయెట్రీ అంటారు. అదే నండూరి వారి కాల్పనిక భావకవిత్వం.

ఈ ఎంకి పాటలు ఎపుడు ఎలా పుట్టాయి అని వివరాలు తెలుసుకోవాలంటే ఆయన మద్రాస్ కళాశాలలో చదివే రోజుల్లో జట్కా బండిలో వెడుతుంటే ఒక పదప్రయోగం మనసులో ఉదయించింది. అదే గుండె గొంతుకలోన కొట్లాడుతాది. పక్కన మిత్రులు ప్రోత్సహించారు.అదే ఒరవడితో ఎంకిపాటలుగా దాదాపు 75 పాటలు రచించారు.

కుటుంబ వ్యవస్థకు ప్రాధాన్యమిచ్చే దేశం మనది. కష్టమైనా, నష్టమైనా, సుఖదుఃఖాలలోను ఇరువురు కలసి పంచుకుందాం, వివాహసమయంలో పట్టిన నీ చేయి విడువను అని బాసలు చేసుకుంటారు. తరువాత అసలు కథ మొదలవుతుంది. ఒకరినొకరు అర్థం చేసుకోవడం, కలహాలు చిన్నవిషయాలలో పొరపొచ్చాలు రావడం, సర్దుకుపోవటం ఇవన్నీ సామాన్యమైన విషయాలు ప్రతి ఒక్కరి జీవితంలో. ఇదే ఇతివృత్తంగా పల్లెటూరి వాతావరణంలో తెలుగుతనాన్ని నింపుకుని పల్లెసీమలలో జంటగా విహరించే నాయిక ఎంకి ఐతే నాయకుడు నాయుడు బావ.

ఎంకి పాటలలో సొగసు, సులభమైన మన అచ్చ తెలుగు పదాలలో నండూరివారు ఇటు పండితులకు, అటు పట్టణం నుంచి పల్లెటూరివరకు సామాన్య ప్రజకు అర్థమయ్యే రీతిలో అందిచారు. మచ్చుకకు కొన్ని పాటలు ఇక్కడ ఇస్తున్నాము, చూడండి.

ఎంకీ నాతోటి రాయె రాయె మన ఏంకటేశరుణ్ణి ఎల్లి సూసొద్దాం.

ఆవుల్ని, దూడల్ని అత్తోరి కాడుంచి,

మూటా ముల్లీ గట్టి

ముసిలోళ్ళతో సెప్పి

ఎంకీ నాతోటి రాయె రాయె మన ఏంకటేశరుణ్ణి ఎల్లి సూసొద్దాం.

★★

కొమ్మలో కోయిల కూ అంటాది

రాగతనమో ఏమో బాగుఒగెరుగదే

కొమ్మలో కోయిల కూ అంటాది

ఎంకి దూరా నుంటి

ఏటి దరి నే నుంటి

సావాసమింకెవరో సందడెవరోనంటి

ఏటి కడుపున దాగి

తోట నిదురోయింది

ఆలనా నా సొదకు పాలనాయెనుదంటి

కొమ్మలో కోయిల కూ అంటాది

తరిమి తరిమేసాను

తరిమి తరిమేసాను

తిరిగి కూ కూ అంది

ఆడింది ఆటగా పాడింది పాటగా

కొమ్మలో కోయిల కూ అంటాది

ఈ పాటను చిట్టిబాబు గారు తన గోటితో వీణపై మీటి చాలా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు.

మన తెలుగింటివారి ఎంకి ఎలా ఉంటుందంటే....

★★

గుండెగొంతుకలోన కొట్లాడుతాదీ

కూకుండనీదురా కూసింతసేపు

నాకాసి సూస్తాది నవ్వు నవ్విస్తాది

యెల్లి మాటాడిస్తె యిసిరికొడతాదీ

ఇంకా నాయుడు బావ ఎంకి గురించి ఏమంటాడంటే

★★

ఎంకి రాలేదాని ఏటో సూత్తాఉంటె

ఎనకాలగా వచ్చి ఎవురు వోరంటాది

ఎన్నాని సెప్పేది

ఎంకి నాయుడు గురించి ఏమంటుందంటే

★★

నీతోటె ఉంటాను నాయుడు బావా

నీమాటె యింటాను నాయుడు బావా

సరుకులేమి కావాలె సంతన పిల్లా

నువ్వు మరమమిడిసి మనసియ్యి నాయుడు బావా

ఎంకి నాయుడుబావ మధ్య విరహంతో కూడా పాటలు రాసారు నండూరివారు

★★

నన్నిడిసిపెట్టెల్లినాడే నా రాజు మొన తిరిగొస్తనన్నాడే

ఉత్తమా ఇల్లాలినోయీ

నన్నుసురుపెడితే దోసమోయీ

ఏలనే నవ్వంట! ఏడుపేలే యంట

పదిమంది ఆయింత పగలబడినారంట

అవును భార్యా భర్త మధ్య జగడం వస్తే, మాట జారితే ఊరు వాడా యాగి.అదే విషయాన్ని ఎంత సున్నితంగా పాటలో చెప్పారు.

తిరునాళ్ళకెడుతున్నపుడు, ఊరి జాతరలలో

★★

ఎంకితో తీర్థానికెల్లాలి

సంకలో పిల్లోడు సంబరాలు పడుతుంటె

ఎంకితో తీర్థానికెల్లాలి

★★

ఎంకివంటి పిల్ల లేదోయ్ లేదోయ్

ఎంకినా వొంకింక రాదోయ్ రాదోయ్

మెళ్ళో పూసలపేరు తల్లో పూవులసేరు

కళ్ళెత్తి తేసాలు కనకాభిసేకాలు

ఇటువంటి నండూరివారి ఎంకి,నాయుడు బావ ఊహలలో పాత్రలె ఐన ఈ పాటలలో జానపదం, వాస్తవం, అనుభవం, భక్తి, వేదాంతం, తెలుగుతనం, ప్రకృతి, సౌదర్యం, సాంస్కృతిక ప్రదర్శన, ముగ్ధమనోహరమైన దృశ్యాలు ఇవన్నీ ప్రస్ఫుటమవుతాయి.

నండురివారు సృష్టించిన ఎంకి కి వందేళ్ళు నిండినా మన తెలుగువారి మదిలో మాత్రం ఆమె ఇరవై ఏళ్ళ జవ్వని గా నిత్యనూతనంగా సజీవంగానే ఉంటుంది.

❖❖❖❖❖



# వాహిని ఈ మాసపు ప్రశ్నావళి

**'వాహిని'** మాసపత్రికలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినవారిలో స్థానికంగా సిడ్నీ **వారికి Just Cakes** వారిచే $25 విలువ గల Gift Voucher కానుకగా అందించబడుతుంది. సమాధానాలు Vahini@sydneytelugu.org e-mail కు ఆగష్టు 30 వ తేదీలోగా పంపగలరు.

## 'కూనలమ్మ పదాలు' రచించిన కవి పేరు?




**గత మాసపు ప్రశ్నకు సమాధానం: మీకు తెలిసిన ఒక తెలుగు కవి గురించి ఐదు పంక్తులలో రాసి పంపండి**

### గుర్రం జాషువా
**నవయుగ కవి చక్రవర్తి**

జన సామాన్య భాషలో పద్యానికి 'నడక' నేర్పిన విశ్వ మానవుడు. అస్పృశ్యతపై గళమెత్తిన దళిత జనహృదయ వేదనే ఈయన కవిత్వం. శుద్ధ వ్యవహార శైలిలో, ఆధ్యాత్మిక, అతివాద తెరలను చించివేసిన మహాకవి. కవితా ప్రతిభ ఏ కొందరికో సాధ్యమనే 'అలౌకిక' సరిహద్దులను చెరిపివేసిన కవి. తెలుగు పద్యానికి ఆధునికతా పరిమళం అద్ది ఎంత సామాన్య విషయాన్నైన పద్యంలో చెప్పవచ్చని నిరూపించాడు.

**శ్రీ జయచంద్ర తెన్నేటి, వరంగల్**

20వ శతాబ్దం లో నాకు నచ్చిన మేటి కవి **జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు**, చెట్టున విరబూసిన పూల చూడగానే పుష్పవిలాపం గుర్తు కు రానివారుండరు

అలాగే కుంతీ కుమారి ఖండ కావ్యం కూడా శాస్త్రి గారి కలం నుంచి జాలువారిన ఆణిముత్యం.

మధురమైన పద గణాలతో పండితపామరుల హృదయాలలో తనదైన శైలిలో చెరగని ముద్ర వేసారు.

తన కలం పేర్లు ప్రస్తావన లో "ఉదయశ్రీ" నా హృదయం,"విజయశ్రీ" నా శిరస్సు,"కరుణశ్రీ" నా జీవితం అన్నారు

**తెన్నేటి మురళీ మనోహర్, వరంగల్**

**కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథసత్యనారాయణ గారు**

సాహితీ జగత్తు 'మేరు శిఖరం'గా మరియు సాంప్రదాయ సాహిత్యానికి పెద్ద దిక్కుగా భావించబడే 'విశ్వనాథ' వారు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. విశిష్టమైన శైలి, లోకానుభవం అతని రచనల్లో ప్రతిబింబిస్తుంది. వినూత్న, విశిష్టమైన పాత్ర చిత్రణకు 'విశ్వనాథ' పెట్టింది పేరు. అనితరమైన శైలి ఈయన సొంతం. వీరిచే విరచిత "వేయి పడగలు' ఆధునిక విజ్ఞాన సర్వస్వం. వెరసి ఈయన 'తెలుగు జాతి రత్నం'.

**డా. పర్చా పద్మావతి,వరంగల్**

❖❖❖❖❖



మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయ రచయిత శ్రీ శంకరంబాడి సుందరాచారి గారి జయంతి ఆగష్టు 10 వ తేదీ సందర్భంగా వారికి నివాళులు

❖❖❖❖❖

# వాహిని పాఠకుల స్పందన

వాహిని సంపాదకులకు,

కైమోడ్పులు. జులై మాసపు వాహిని సంచిక కన్నులముందు సాక్షాత్కరించింది. అక్షర రత్నాలను, సాహిత్య మరకతాలను, కథావైడూర్యాలను, నవలామాణిక్యాలను కన్నులతో ఆబగా ఏరుకుని మనోకోశంలో భద్రపరుచుకున్నాను. ఈ మాసపు వాహిని షడ్రుచులతో నిండి వున్న అరటిఆకు వలెనున్నది. నవరసాలతో నిండివున్న సుధాభాండము వలెనున్నది. ఇది ఆస్ట్రేలియా నుంచి ప్రసరిస్తున్న తెలుగువెలుగు! ప్రతిమాసమూ క్రొంగొత్త జిలుగులతో తెలుగు ఎడదలను కొల్లగొడుతున్న నవనీత చోరిణి యిది! ప్రతి మాసం విజయ గొల్లపూడి గారి అహరహాల అకుంఠిత దీక్షాఫలమిది! వారికి తెలుగుజాతి శుభాశీస్సుల నందిస్తున్నది. వాహినిలోని ఈ అంశం బాగాలేదు అని రంధ్రాన్వేషణ చెయ్యాలని ఎంత ప్రయత్నించినా వైఫల్యమే కలుగుతుంది సుమా! అందుకని హాయిగా, సరసంగా, ఆనందంగా మాసపత్రికను ఆసాంతం చదువుకుని 'మనసు పరిమళించెనే" అని తృప్తినొందాను.

తా.క. మీరు, తెలుగు అసోసియేషన్, సిడ్నీవారు నిర్వహించిన సాహితీసదస్సు తాలుకు మధురమైన అనుభూతులను ఎన్నాళ్ళైనా నెమరువేసుకుంటూనే వుంటాము.

వాహిని సంపాదక వర్గానికి అభినందనలు, ఆశీస్సులు.

భవదీయుడు,

శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్.

వాహిని సంచిక చూడ ముచ్చటగా చాలా బాగుంది.

శ్రీ పెయ్యేటి రంగారావు గారి భగవద్గీతా విశ్లేషణ అందరిని ఆకట్టు కొంటోంది. తెలుగు సాహిత్య వైభవము చదువుతుంటే ఆనందముగా అనిపించింది.

మహిమ సీరియల్ ప్రారంభం చాలా ఆసక్తిదాయయకంగా వుంది.

సాహితిసదస్సు విశేషాలు వివరంగా తెలియచేసేరు.

శ్రీ సరసి గారి కనూకకకలు,కార్టూన్లు ఎంతో బాగున్నాయి.

వాహిని సంపాదకులకు నా పద్యాలు ప్రచురించినందుకు ధన్యవాదాలు.

అభినందనలతో

చావలి విజయ, సిడ్నీ



ఉజ్జయిని మహంకాళి ముఖ చిత్రంతో కొరోనాకు హెచ్చరిక పంపిస్తున్నట్లుగా వాహిని క్రొత్త అందాలను సంతరించుకుంది... భాషలో భావం పొదిగినప్పుడు పదాలకు కొదవేముంది... సంపాదకీయంలో ప్రతి పదం తెలుగు భాష పట్ల వాహినికి ఉన్న ప్రత్యేక అభిమానం తెలుపుతోంది...

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల గురించి మంచి వివరణ ఇచ్చారు... వైరాగ్యం కలిగినవారికే బ్రహ్మ జ్ఞానం ఉపదేశించాలంటూ అర్జునునికి బ్రహ్మ జ్ఞానాన్ని బోధించటం... స్మశానంలో సింహాసనం వేసుకుని రాజ్యమేలాలా... అర్జునుడి వైరాగ్యం కృష్ణుడి గీత బోధన కారణంగా కార్యోన్ముఖుడిని చేసింది... శ్రీ పెయ్యేటి రంగారావుగారు చక్కటి చిత్రాలతో భగవద్గీత వివరించటం చాలా బాగుంది...

వాహిని సాహిత్య సమ్మేళనంపై వంగూరి చిట్టెన్ రాజుగారు తనదైన సరళిలో హాస్యపు జల్లులు కురిపించారు... "తెలుగు సాహిత్య వైభవం" నిజంగా వెలుగులు పంచుతోంది... ఇక్కడ మనకు విజయ గొల్లపూడిగారిలాంటి నిబద్ధత కలిగిన సంపాదకులు ఉన్నారు... రంగారావుగారు చెప్పింది అక్షర సత్యం...

శ్రీలక్ష్మి అమ్మవారు మన అంతరాలలో ఎలా కొలువై ఉన్నదీ శ్రీమతి లలిత రాంభట్లగారు అందించిన వ్యాసం బాగుంది...

'నా భాష నా ఉనికి' బాగుంది... భాషే లేనప్పుడు ఉనికి ఎలా వస్తుంది... సతీశ్ బాబుగారి కవిత మనసుకు తట్టి లేపింది...

శ్రీమతి డి. కామేశ్వరిగారి 'మహిమ' మళ్ళీ పాత రోజుల్లో సీరియల్ చదివిన అనుభూతి కలుగజేసింది...

శ్రీ సరసిగారి 'కనూ కక కలు' కిలకిలమని నవ్వించింది... ప్రస్తుత తీవ్ర సమస్య కొరోనాపై వారి జోకులు బాగున్నాయి...

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవిగారి 'హార్ట్ టచింగ్ పంచ్' బాగుంది...

వాహినిలో ప్రతి శీర్షికపై ఎంతో శ్రద్ధ తీసుకుంటూ జనరంజకంగా తీర్చిదిద్దారు...

శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్

. ❖❖❖❖❖



రాజా రవివర్మ కళాత్మక చిత్రం

- శ్రీమతి డి. కామేశ్వరి, హైద్రాబాద్

## సీరియల్ రెండవ భాగం



"ఓ ఎస్" అంది మహిమ ఉత్సాహంగా.

"మరింకేం. నీకెప్పుడు కావల్సి వచ్చినా, నాది వాడుకో. కొత్తది కొనుక్కో. లోన్ కావాలంటే ఇస్తారు" అంది సీమ.

మెయిన్‌రోడ్ మీద నుంచి, ఓ సందులోకి దారితీసి, మై హోమ్ అపార్ట్‌మెంట్ గేట్‌లోంచి బేస్‌మెంట్‌లోకి తీసుకెళ్ళి తన స్కూటీని పార్క్ చేసింది సీమ.

"ఇదే మా అపార్ట్‌మెంట్. మన ఫ్లాట్ థర్డ్‌ఫ్లోర్‌లో ఉంది. రా" ఇద్దరూ లిఫ్ట్‌లో పైకి వెళ్ళారు. "ఇవిగో ... 304, 306 ఈ రెండు ఫ్లాట్‌లు మనవే. మేం అందరం కలిసి తీసుకున్నాం. ఎదురెదురుగా ఉన్నాయి రెండు ఫ్లాట్లు. లోపలికి వెళ్ళగానే డ్రాయింగ్ రూము, సోఫాసెట్టు, టీ.వి., ఓ పక్క డైనింగ్ టేబుల్ ఉన్నాయి.

"ఇదిగో, ఇది మన రూము" అంది సీమ.

ఓ మాదిరిగా గది పెద్దదే. రెండు కిటికీల దగ్గర రెండు మంచాలు. ఎవరి మంచం దగ్గర వారికి టేబిల్, రెండు కప్‌బోర్డ్‌లు. సీమ టేబిల్ ... కంప్యూటర్, పుస్తకాలు ... సామానుతో నిండి ఉంది. గదికి ఆనుకుని చిన్న బాల్కనీ ఉంది. బట్టలు ఆరేసున్నాయి. రెండు ప్లాస్టిక్ కుర్చీలు, బాత్‌రూమ్, గీజరు, షవరు అన్నీ సదుపాయంగా ఉన్నాయనిపించింది.

"ఓ గుడ్! చాలా బాగుంది రూము. ఇద్దరికి కంఫర్టబుల్‌గా సరిపోతుంది. ఒకరికొకరు తోడు. చక్కగా కబుర్లు చెప్పుకోవచ్చు" సంతోషంగా అంది మహిమ.

"సరే అయితే, రేప్పొద్దున ఎనిమిది గంటలకల్లా సామానుతో వచ్చేయి. సామానిక్కడ పడేసి ఆఫీసుకు వెడదాం. టిఫిన్ ఇక్కడే చేద్దాం" అంటూ "రేణుకా ..." అని పిలిచింది సీమ. వంటింట్లో పనిచేస్తున్న ముప్పై, ముప్పై ఐదేళ్ల పనమ్మాయి వచ్చింది. "రేణుక ... ఈ అమ్మాయి మహిమ. రేపటి నుంచి నా రూమ్మేట్. తనూ రేపు టిఫిన్ చేస్తుంది. తనకు కూడా లంచ్ బాక్స్ ఇవ్వాలి" అని రేణుకకు చెప్పి, మహిమ వైపు తిరిగింది.

"తను రేణుక. మన పన్లన్నీ చూస్తుంది. వంట అన్నీ తనే. నీకేం కావాలన్నా తనని అడుగు" అంది సీమ. "నమస్తే అమ్మా" అంది రేణుక. "ఇంక నేను రేపటినుంచి ఇక్కడి మెంబర్‌ని" నవ్వుతూ అంది మహిమ.

"ఇంకా అందరూ ఇంటికి వచ్చినట్టు లేదు. అందరిని రేపు పరిచయం చేస్తా, ఇంక బయలుదేరు. మళ్ళీ ఆలస్యం అవుతుంది. ఎనిమిదికల్లా రావాలి, ఆలస్యం చేయొద్దు. ఇల్లు కనుక్కోగలవు గదా ! అన్నట్టు నా సెల్ నెంబర్ నోట్ చేసుకో, నీది నాకు చెప్పు" అంటూ నెంబర్ తీసుకుంది. "బై సీమా ... సీ యూ టుమారో" అంటూ వెళ్ళింది మహిమ. ఇంత మంచి అకామడేషన్, ఇంత మంచి రూమ్మేటు, మంచి ఉద్యోగం ... మహిమకి గాలిలో తేలిపోతున్నట్లు సంబరంగా ఉంది.

❊ ❊ ❊

"డాడీ ! నాకు ఉద్యోగం వచ్చేసింది. జీతమెంతో తెలుసా ? గెస్ ! అకామడేషన్ కూడా దొరికింది. ఆ కంపెనీలోనే పనిచేసే అమ్మాయిలు కొందరు అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారిలో ఒకరితో రూమ్ షేర్ చేసుకుంటాను. ఎవ్రీథింగ్ సెటిల్డ్. రేపే రూముకి షిఫ్ట్ అవుతున్నా" రాత్రి ఇంటికి ఫోను చేసింది మహిమ, చాలా ఉద్విగ్నంగా.

"ఓ ... గ్రేట్" సంతోషంగా అన్నాడు కృష్ణమూర్తి. "జాగ్రత్తమ్మా ! ప్రకటనల ప్రపంచంలో అనేకానేక కథలు వింటుంటాం. ఎంత తొందరగా పైకి వెళ్ళొచ్చో అంత త్వరగాను కిందకి జారచ్చు. నీ లిమిట్స్ దాటకు. నీ రూమ్మేట్ మంచి అమ్మాయేనా ? చెడు అలవాట్లకి ..."

"అబ్బ డాడీ ... నేనేమైనా టీనేజ్ అమ్మాయినా ? నా లిమిట్స్ నాకు తెలుసు డాడీ. నేను చేసేది క్రియేటివ్ జాబ్. మోడల్‌ని, యాక్టర్‌ని కాను, డెస్క్ వర్క్ నాది. డాడీ, ఆఫీసు ఎంత పెద్దదో తెలుసా ? ఎన్ని సెక్షన్స్ ఉన్నాయో?

నాలుగైదు వందలమంది స్టాఫ్. నన్ను చూసి మా బాస్ ఇంప్రెస్ అయినట్టే కనిపించాడు. జవాబులు విని ఓపెన్‌గానే మెచ్చుకున్నారు" సంతోషంగా అంది.

"మంచిది. కీపిట్ అప్. రూమ్‌కి మారాక అడ్రసు, అది ఇవ్వు. సెల్‌ఫోను దగ్గరుంచుకో. అన్నట్టు భోజనం అది ..."

"ఆ చెప్పలేదు కదూ ... మర్చిపోయా. అందరూ కలిసి వంటపని, మిగతా పనులు చూసేందుకు పనమ్మాయిని పెట్టుకున్నారు. మూడు బెడ్‌రూముల్లో ఆరుగురం ఉంటాం. అందరికి వంట, టిఫిన్లు అన్నీ చూస్తుంది. ఖర్చులు అందరం షేర్ చేసుకుంటాం. ఏ ప్రాబ్లమ్ లేదు డాడీ ..."

"సరే మహీ ! ఫోను చేస్తూండు. మీ మమ్మీ పడుకుంది. రేపు రూముకి షిఫ్ట్ అయ్యాక అమ్మతో మాట్లాడు. ఓకే బై గుడ్‌నైట్" నిశ్చింతగా సోఫాలో వెనక్కి వాలారు ఆయన. కూతురు అహ్మదాబాద్ సీటు కోసం ఎంత కష్టపడి చదివిందో ఆయనకి తెలుసు. ఇంజనీరింగ్ చదవమంటే కాదని, తన అభిరుచి క్రియేటివ్ రైటింగ్ అని, యాడ్ వరల్డ్‌లో రాణించాలని కలలు కంది. మొదటి మెట్టు ఎక్కింది. ఇంక పరవాలేదు. నిశ్చింతగా అనిపించింది.

※ ※ ※

రెండు సూట్‌కేసులు, ఓ షోల్డర్ బ్యాగుతో ఎనిమిది గంటలకల్లా అపార్ట్ మెంట్‌కు వచ్చింది మహిమ. "వెల్‌కమ్ వెల్‌కమ్" అంటూ సీమ సంతోషంగా చేయిచాపి చేతిలో సామాన్లు అందుకుంది. అప్పటికింకా నైట్‌గౌనులోనే ఉంది. మొహం నిండా ఏదో క్రీము పట్టించింది. జుత్తుకు నూనె. "రా, ఇదిగో ఈ కప్ బోర్డ్ నీది. బట్టలు తీసి సర్దేసుకో. ఈ టేబిల్ మీద నీ సామానేం పెట్టుకుంటావో పెట్టుకో. ఈలోగా నేను స్నానం చేసి వస్తా. తరువాత టిఫిన్ చేద్దాం" అంటూ బాత్‌రూములో దూరింది.

బట్టలన్నీ తెచ్చుకున్న హేంగర్లకి తగిలించి, వార్డ్‌రోబ్‌లో మంచిబట్టలు

ఒక వైపు, రోజా కట్టుకునేవి ఒకవైపు ఎక్కడికక్కడ నీట్‌గా సర్దుకుంది. అడుగున ఉన్న అరలో చెప్పులు, ఇంటి నుంచి తెచ్చుకున్న సబ్బులు, షాంపూలు, టూత్‌పేస్ట్‌లు పెట్టింది. అద్దం ముందు రోజా వాడుకునే మామూలు మేకప్ సామానులు పెట్టుకుంది. టేబుల్‌మీద ల్యాప్‌టాప్, పుస్తకాలు, టూ ఇన్ వన్ డైరీలు, కాగితాలు, పెన్నులు లాంటివన్నీ సర్దుకుంది.

"గుడ్ ! అయిపోయిందా ?" అంటూ జుత్తును డ్రయ్యర్‌లో ఆరబెట్టు కుంటూ చుట్టూ చూసింది. 'మన ఆఫీసుకి డ్రస్ కోడ్ లేదు. సల్వార్ కుర్తా, జీన్స్, లాంగ్ స్కర్ట్స్ ఏవయినా మన ఇష్టం వచ్చినవి వేసుకోవచ్చు. జుత్తు దువ్వి పైకి లాగి క్లిప్ పెట్టి, "పద టిఫిన్ చేద్దాం. అక్కడ అందరం కలుస్తాం గదా. అందరికి పరిచయం చేస్తాను" ఎనిమిదిన్నరకల్లా టిఫిన్ టేబిల్ దగ్గరకి వెళ్లాలి అందరూ. ఏ రోజన్నా సెలవుపెట్టినా, ఇంకేదన్నా పని ఉండి వెడితే ముందుగా రేణుకకి చెపితే వేరే పెట్టి ఉంచుతుంది టిఫిన్. ఉతకాల్సిన బట్టలు బాత్‌రూములో బాల్చీలో నానపెట్టాలి. రా" అంటూ డైనింగ్ హాల్లోకి తీసుకెళ్లింది. అప్పటికే నలుగురమ్మాయిలు టేబిల్ ముందు కూర్చుని మాట్లాడుకుంటున్నారు".

"హాయ్ ..." అన్నారంతా. మహిమని చూసి "కొత్త రూమ్మేటా ?"

"ఆ ... మహిమ. క్రియేటివ్ సెక్షన్‌లో ఇవాళే జాయిన్ అవుతోంది. మనతో ఉంటుంది. నా రూమ్మేట్. పేరెంట్స్ వైజాగ్‌లో ఉంటారు" అని చెప్పి, "మహిమ ... తను స్రవంతి. ఫైనాన్స్‌లో ఉంది ..."

చామనచాయ రంగు, పెద్దకళ్ళు, తెలివైన మొహం. నవ్వుతూ చేయిచాచి, "హాయ్, వెల్‌కమ్ టు అవర్ నెస్ట్" అంది మహిమ చెయ్యినొక్కి.

"ఈమె మంగళ. క్రియేటివ్ సెక్షన్‌లో తమిళ సెక్షన్. మద్రాసు పొన్ను" అంది నవ్వి సీమ. తమిళ అమ్మాయని చెప్పకపోయినా గుర్తుపట్టేట్టు, స్టిక్కర్ పైన విభూతి బొట్టు, కాటన్ సల్వార్ కుర్తా. సింపుల్‌గా ఉంది. పలకరింపుగా నవ్వి "హాయ్ ..." అని.

"ఇదిగో తను ఆరతి. విజువల్స్. ఇప్పుడిప్పుడే చిన్న చిన్న యాడ్స్‌లో యాక్ట్ చేస్తోంది. చేరి ఆర్నెల్లయిందిలే ... మంచి మోడల్ అయిపోవాలని, ఆ తర్వాత ఫ్యాషన్ వరల్డ్‌లోకి వెళ్లిపోవాలని, ఆ తరువాత దేవుడనుగ్రహిస్తే సినిమాల్లోకి ... చాలా చాలా కలలున్నాయి" హాస్యంగా అంది సీమ.

"యార్, నవ్వకు. ఏదో ఒకరోజు సినిమాతారనయిపోయి చూపిస్తా" తనూ నవ్వుతూ స్పోర్టివ్‌గా అంది ఆరతి. మార్వాడీ అమ్మాయి. చక్కగా, అందంగా ... అందం కంటే ఆకర్షణీయంగా ఉంది. కళైన మొహం. చూడగానే బాగుంది అనిపిస్తుంది. సినీతార కాదగ్గ అర్హతలన్నీ ఉన్నాయి. యాడ్ వరల్డ్ నుంచి ఎంత మంది సినీరంగానికి వెళ్లలేదు. ఆరతి మహిమని చూస్తూ చేయిపట్టుకు స్నేహంగా "క్రియేటివ్ సెక్షనేమిటి, ఇంత చక్కగా ఉన్నావు. రాంగ్ ఛాయిస్. యాడ్ వరల్డ్‌లో ఉండాలి నీవు" అంది చనువుగా.

"ఇదిగో నీకు పోటీ వచ్చిందంటే తట్టుకోలేవు. పిచ్చిసలహాలిచ్చి నీ ఫ్యూచర్‌ని నువ్వే పాడుచేసుకోకు" సీమ నవ్వుతూ అంది. అంతా నవ్వారు.

రేణుక కేస్‌రోల్స్ తెచ్చి టేబిల్ మీద పెట్టింది. మరో దాన్లో సాంబారు, ఒక బౌల్‌లో పచ్చడి తెచ్చిపెట్టింది. అంతా ఎవరికి కావల్సిన ఇడ్లీలు వారు పెట్టు కున్నారు. అందరి ప్లేట్ల దగ్గర తలో అరటిపండు తెచ్చిపెట్టింది. అంతా తినడం పూర్తి అయ్యేలోగా అందరికీ వేడివేడి కాఫీ, టీ తెచ్చింది. 'ఫరవాలేదు, ఇంత మాత్రం టిఫిన్ దొరికితే. ఇడ్లీ, సాంబారు రుచిగానే ఉన్నాయి' అనుకుంది మహిమ.

"మహిమ ... వారంలో రోజుకొక టిఫిను. అంటే ఇడ్లీ, పూరి, ఉప్మా, ఆదివారం స్పెషల్ దోశ ... ఇలా చేయిస్తాం. ఉదయం కాఫీ, టీ, ఎవరికేది కావలిస్తే అది. మళ్ళీ టిఫిన్‌తో పాటు కాఫీ, టీలు. లంచ్‌బాక్స్‌లో తలో రెండు చపాతీలు. కూర చేసి ఇస్తుంది. రాత్రి డిన్నరు. మనం అంతా వెళ్లాక సావకాశంగా రూములన్నీ తుడిచి, బట్టలుతికి మిగతా పనులు చేస్తుంది. కూరలు కావల్సినవి తనే తెచ్చుకుంటుంది. మొత్తం పని బాధ్యత అంతా

రేణుకదే. ఇస్త్రీకి రోజూ చాకలి వస్తాడు. ఇంటి అద్దె, కరెంటు, భోజనం ఖర్చు, రేణుక జీతం మొత్తం అందరం షేర్ చేసుకుంటాం. లెక్కలు రాయడం, అందరి దగ్గర డబ్బులు కలెక్ట్ చేయడం ... మన ఫైనాన్స్ మినిస్టర్ స్రవంతి చూస్తుంది" టిఫిన్ చేస్తూ అన్నీ వివరించింది సీమ.

"ముందు అడ్వాన్స్‌గా ఇవాళ పదివేలు ఇవ్వు. నెలాఖరుకి మిగతా లెక్కలు. సరేనా ?"

మహిమ తల ఊపి, "ఏటీఎమ్‌లో డ్రా చేసి సాయంత్రం ఇస్తాను" అంది. తల ఊపింది స్రవంతి. అందరూ టిఫిన్ తిని, కాఫీ తాగుతుండగా, నైట్ గౌనులో బద్ధకంగా ఆవలిస్తూ ఒక అమ్మాయి వచ్చింది. "హాయ్ ! గుడ్‌మార్నింగ్ ఎవ్రీబడీ!" మహిమని ప్రశ్నార్థకంగా చూస్తూ "ఎవరీ ఏంజిల్ ?" అంది ముద్దు ముద్దుగా. "ఇంకా మత్తు వదల్లేదా తల్లీ ? ఏ దేవకన్యా దిగి రాలేదులే. తను మహిమ. ఇవాళే కొత్తగా జాయిన్ అవుతోంది" సీమ ముక్తసరిగా అంది.

"మహిమ ! బూటిఫుల్ నేమ్, బ్యూటిఫుల్ ఫేస్. ట్రై యువర్ లక్ ఇన్ దిస్ ఫ్యాషన్ వరల్డ్. బట్, కేర్‌ఫుల్ ! ఏ మగాడినీ నమ్మకు. పనిని నమ్ముకో, నీ టాలెంట్‌ని నమ్ముకో. ఇదిగో నా అనుభవంతో చెపుతున్నాను ... నమ్మకు, ఏ మగాడినీ నమ్మకు. ఏ మగాడి పొగడ్తలకి పడిపోకు. నిన్నేదో స్టార్‌ని చేసేస్తామని ఎవరన్నా అంటే, బుల్‌షిట్, నమ్మకు" కసిగా అంది.

"ప్రీతి స్టాపిట్ ! మహిమ విజువల్స్ కాదు. క్రియేటివ్ సెక్షన్. నీ సెర్మన్స్ చాలు" స్రవంతి విసుగ్గా అంది.

"ఏ యూనిట్ అయితేనేం ... అందంగా ఉంది కదా. నిన్ను యాడ్ వరల్డ్‌లో స్టార్‌ని చేసేస్తాం అంటూ చుట్టుముడతారు. నమ్మకు ఆ మాటలు ..."

"సరే, సరే, అలాగే. మాకు టైమైంది. వెళ్లాలి. పద మహిమ" అంటూ సీమ లేచింది.

**సశేషం**

❖❖❖❖❖


BRAND NEW MELBOURNE CBD & SOUTHBANK APARTMENTS
1, 2 & 3 beds from $489,000* (Off-the-plan)
Discover Our Spacious Inner-City Apartments
Artist's Impression
Walk to Melbourne city centre, Arts Precinct, shopping, cafes, restaurants, parks, transport & more.
Easy Access to RMIT & Melbourne University.
Exclusive resident facilities: Indoor pool, gym, terrace courtyard, BBQ, concierge & more.
✔ Low Owners Corporation Fees (Strata Fees)
BUY DIRECT from AUSTRALIAN OWNED DEVELOPER
INSPECT IN SYDNEY OFFICE BY APPOINTMENT:
299 Elizabeth Street, Sydney
1800 44 55 20
Multilingual staff available, many Indian languages spoken
centralequity.com.au
CENTRAL EQUITY 30TH YEAR CELEBRATION
AWARD WINNING MELBOURNE DEVELOPER
OVER 75 PROJECTS DELIVERED AS PROMISED
*Price as at 28/6/2018 until sold.

# పాట నేర్చుకుందామా/పాడుకుందామా

చిత్రం: లవకుశ

సంగీతం: శ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు

సాహిత్యం: శ్రీ సముద్రాల రాఘవాచార్య

గానం: ఘంటసాల, పి. సుశీల, పి. లీల

**జయ జయ రాం జయ రఘురాం జయ జయ రాం జయ రఘురాం**

**జగదభి రాముడు శ్రీరాముడే..**

**రఘుకుల సోముడు ఆ రాముడే**

**జగదభి రాముడు శ్రీరాముడే..**

**రఘుకుల సోముడు ఆ రాముడే**

**జగదభి రాముడు శ్రీరాముడే..**

**జనకుని మాటన తలపై నిలిపి..**

**తన సుఖముల విడి వనితావణి తో**

**వనములకేగిన ధర్మావతారుడు..**

**జగదభి రాముడు శ్రీరాముడే**

**చరణం 1 :**

**కరమున ధనువు శరములు దాలిచి.. కరమున ధనువు**

**ఆ ఆ..ఆ..ఆ.... ఆ ఆ..ఆ..ఆ... ఆ ఆ..ఆ..ఆ**

**కరమున ధనువు శరములు దాలిచి..**

**ఇరువది చేతుల దొరనే కూలిచి**

**సురలను గాంచిన వీరాధివీరుడు..**

**జగదభి రాముడు శ్రీరాముడే**

**చరణం 2 :**

**ఆలుమగల అనురాగాలకు ఆలుమగల అనురాగాలకు**

**పోలిక సీతారాములే అనగా..**

**పొలిక సీతారాములే అనగా**

**వెలసిన ఆదర్శ ప్రేమావతారుడు..**

**జగదభి రాముడు శ్రీరాముడే**

**నిరతము ధర్మము నెరపీ నిలిపీ..**

**ఆ..ఆ..ఆ..ఆ..ఆ**

**నిరతము ధర్మము నెరపీ నిలిపీ..**

**నరులకు సురలకు తరతరాలకు**

**ఒరవడి అయినా వర యుగపురుషుడు..**

**జగదభి రాముడు శ్రీరాముడే**

చరణం 3 :

ఇనకులమణి సరితూగే తనయుడు

అన్నయూ ప్రభువు లేనే లేడని

ఇనకులమణి సరితుగే తనయుడు

అన్నయూ ప్రభువు లేనే లేడని

జనులు భజించే పురుషోత్తముడు...

జగధబి రాముడు శ్రీరాముడే...

రఘుకుల సోముడు ఆ రాముడే

జగధబి రాముడు శ్రీరాముడే...

జయ జయ రాం జయ రఘురాం జయ జయ రాం జయ రఘురాం

https://www.youtube.com/watch?v=9AshdyFBhPs

❖❖❖❖❖



అయోధ్య లో నిర్మితమయ్యే రామమందిర నమూనా

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

**INDAUS IMMIGRATION**

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

*Sydney (Branch Office)*

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

*Melbourne (HQ)*

Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

*Hyderabad, India*

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com

# అమెరికార్తీకుల భోజనాలు

---వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

మొన్న కార్తీక మాసంలో నేను కాకినాడలో ఉన్నాను. మా చిన్నప్పటి కార్తీక మాసం రోజులకీ ఇప్పటికీ దేశం చాలా తిరోగమించింది అని నాకు అనిపిస్తే "నీకేం తెలుసూ...అదంతా పురోగముంచడం" అంది మా క్వీన్ విక్టోరియా. ఇంత వరకూ నేను ఆ తెలుగు మాట విన లేదు కాబట్టి 'పురోగముంచడం" అంటే ఏమిటో ఆ మహారాణినే అడుగుదాం అనుకుంటే నా మగ అహం అడ్డు రావడం ఒక కారణం అయితే క్లాసు పీకుతుందేమో, అది ఇప్పుడు అవసరమా అని మూసుకున్నాను. తీరా నా తాజా కార్తీక మాసం అనుభవాలు అన్నీ విన్నాక ఆవిడ ఆ మాట అంది కాబట్టి ఆలోచించగా, చించగా నాకూ తెలిసిపోయింది. ఎవరూ పుట్టించక పోతే కొత్త మాటలు ఎలా పుడతాయి. ఆవిడకి వీర తాడు వేసేద్దాం అనుకుంటున్నాను.

మొన్న ఒక కార్తీక సోమవారం నాడు కాకినాడ లో ఒకాయన ఫోన్ చేసి 'సర్, మీరు ఇవాళ ఉపవాసం ఉంటారా?" అని అడిగాడు. 'ఈ వీకెండ్ భోజనానికి వస్తారా, మా ఆవిడ కారం ఎక్కువ, ఉప్పు తక్కువే వేస్తుంది." మొదలైన ఫోన్ పిలుపులు నాకు అలవాటే కానీ ఈయన ఉపవాసం ఉండడానికి వాళ్ళింటికి పిలుస్తున్నాడేమో అని కాస్త విస్తు పోయాను.

"అబ్బే నాకు అలాంటి చెడు అలవాట్లు లేవండి. ప్రతీ రోజూ అడ్డమైన గడ్డీ తింటాను" అని ఉన్న మాట ఆయన చెవిని వేశాను. నేను ఏదో మాట వరసకి గడ్డి తింటాను అని అన్నాననే అనుకోండి. ఆ మాత్రం దానికి ఆయన అంత ఎగిరి గంతేసి ""అలా అయితే మీరు తప్పకుండా వచ్చి, మీ అమెరికాకుల ప్రసంగం చేసి మా మన కార్తీకుల భోజనమూ, మాకు మీరు ఇవ్వదల్చుకున్న మదర్పిత తాంబూలమూ ఇచ్చేసి మేము కంకణం కట్టుకున్న మన కులోద్ధరణ సమాధికి మీద పునాదులకి ఒక ఇటిక వెయ్యాలి." అని ఆవేశపడ్డాడు. ఇక్కడ కీ వర్డ్ 'మదర్పిత .అనగా ఆయన కాదు...నేను అనమాట.

నాకు తలా తోకా అర్థం అవక "మీరు చెప్పిన సంగతి నేను పండితుల చేత విశ్లేషణ చేయించుకుని చెప్తానండి, శాస్త్రి గారూ" అని ఫోన్ పెట్టేశాను. తలగోక్కుంటూ ఉండగా మళ్ళీ ఆయనే ఠకీ మని ఫోన్ చేసి "చిట్టి కన్న  గారు మనకి ఛీఫ్ గెస్టండి. మీరు సెకండ్ ఛీఫ్ గెస్టండి. తప్పదు కదండీ" అన్నాడు సదరు శాస్త్రి.

"చిట్టి కన్న  ఎవరండి సార్"

"ఆయనా, ఆయన మన వాడు కాదు కానీ రూలింగ్ పార్టీ లీడరండి....మనం కట్ట బోయే బిల్డింగ్ కి గవర్నమెంట్ గ్రాంట్ కోసం పిలిచాం అండి".

"మన వాడు, మనోడు, మనం' లాంటి మాటలు వినగానే నాకు విషయం అర్థం అయిపోయింది. ఎందుకైనా మంచిది అని మా మేనల్లుడిని సంప్రదించగానే "ఏం లేదు మామయ్యా, వాళ్ళు కార్తీక వన మహోత్సవాల సభలో ఎం.పీ గారినీ నిన్నూ, మరి కొందరినీ ఆహ్వానిత అతిథులుగా పిలిచి గౌరవం చేస్తారన మాట" అన్నాడు. "గౌరవం అనగానే నాకు శాలువా, దండా, పతకమూ కొండొకచో కుచ్చు టోపీ గుర్తుకి వచ్చి, వెంటనే సదరు శాస్త్రి గారిని పిలిచి ఒప్పుకున్నాను. ఉన్న మాట చెప్పొద్దూ, పైకి ఎన్ని వెధవ కబుర్లు చెప్పినా, ఇలాంటి సత్కారాలు చేయించుకోని వాళ్ళు ఎవరున్నారు చెప్పండి...నాకు కూడా కాస్త కితకితలుగానే ఉంటుంది. "మన వాళ్ళ" కి సన్మానం చేయుట, చేయించుకొనుట అనే  జబ్బు బాగా ముదిరిపోయింది.

సరే, ఆ మర్నాడు మా మేనల్లుడే సకల లాంఛనాల తోటీ ..అనగా ఈ సభకి వెళ్ళడానికి ఆటో రిక్షాలో ఎక్కించాడు. ఆటో రిక్షా ఎక్కగానే ఒళ్ళు హూనం అవడం మొదలు పెట్టినా నేను మోడీ గారి తరవాత నాయుడు గారి లాగా చిట్టి కన్న  తరవాత పొట్టి లీడర్ లా ఫీల్ అయిపోతూ కాకినాడలో భాను గుడి నుంచి పిఠాపురం వెళ్ళే రోడ్ లోకి తిరగగానే  ఓ పక్కన "కమ్మకుల వన మహోత్సవాలు".ఎన్టీఆర్ మేఘాలలోనూ, మేఘాలు మైనస్ లో చంద్ర బాబు కటౌట్ లతో అనే పెద్ద పెద్ద ఫ్లెక్సీ కనపడింది.

"హమ్మయ్య వనభోజనాలకి వచ్చేశాం. ఇక ఒళ్ళు హూనం అవదు" అని సంతోష పడుతూ ఉంటే మా ఆటో వాడు ఆపకుండా దూసుకు పోతున్నాడు.


"అదేమిట్రా, వన భోజనాలకి వచ్చేశాం కదా....ఆ మూల చిట్టి కన్న బొమ్మ కూడా ఉంది." అని నేను కంగారు పడుతూ ఉంటే "అది మనది కాదు మామయ్యా" . వాడు అలా అంటూ ఉండగానే వరసగా "రెడ్డి వన భోజనాలు" అనీ, "నాయీ బ్రాహ్మణ", ఆర్య వైశ్య' "అంబేద్కర్ వన భోజన మహోత్సవాలు"..ఇలా పోటా పోటీలుగా ఉన్న అన్ని తోటలనీ దాటుకుని వచ్చాక మా వాడు "వచ్చేశాం" అని ఒక చోట దిగమన్నాడు. నేను దర్జాగా రెండో ఛీఫ్ గెస్ట్ లాగా ఆటో దిగ గానే ఎదురుగా "బ్రహ్మేణాల వన భోజనాలకి స్వాగతం" అని ఒక తోరణం కనపడింది. ఇదేదో కొత్త కులం బాపతేమో అనుకుని వెనక్కి తిరగ బోతూఉంటే అంతకు ముందు నన్ను ఇంటికి వచ్చి ఆహ్వానించిన శాస్త్రి గారు కనపడి నాకు నమస్కారం పెట్టి "వెల్ కం ఎనార్ఐ గారూ" అని లోపలకి తీసుకెళ్ళాడు. వేదికకి వెళ్లే దారిలో "బ్రాహ్మన", బ్రేహ్మణా" అని రక రకాలుగా తోరణాలు కనపడ్డాయి అంటే ఇక నా పేరు ఎంత చిత్ర వధ చేశారో ఊహించుకో వచ్చును. ఇక ఎమ్మెల్యే గారి పేరు లో కూడా చిట్టి ఉండడంతో ఎవరు ఎవరో తెలియక పంతుళ్ళందరూ నానా అవస్థా పడ్డారు. ఇక వేదిక మీద నా ప్రసంగ అవకాశం వచ్చినప్పుడు ఏం మాట్లాడాలో తెలియక మంచి భాష మాట్లాడవలసిన మనమే ఇలాంటి తప్పు ఫ్లెక్సీలు పెడితే ఎలాగా మన గౌరవం ఎలా నిలబడుతుంది అని కోప్పడ్డాను. ఇక అంతే సంగతులు. నా స్పీచ్ తర్వాత మా మేనల్లుడు నేనెవరో తెలీనట్టుగా జనంలో కలిసిపోయాడు.. నన్ను ఎవరూ భోజనాలకి ఉండమన లేదు. గుమ్మం దాకా సాగనంపా లేదు. ఇక నా ఆటో నేనే కుదుర్చుకుని ఇంటికి వెళ్ళిపోయాను..అనుకోని ఉపవాసానికి. ఆ మర్నాడు శాస్త్రి గారు మరెక్కడో కనపడి మొహం తిప్పేసి పారిపోయాడు. "దొంగ రాస్కెల్" అని కూడా నా గురించి అనుకున్నట్టు నాకు అనుమానం. ఇక పేపర్లలో చిట్టి బాబు గారి అన్ని కులాల వన భోజనాలలోనూ ఏకైక వక్తగా చేసిన ఒకే ఒక ఉపన్యాసం ప్రముఖంగా ప్రచురించబడింది. కుల వరాలు గుప్పించడంలో ఈయన చంద్ర బాబుని మించి పోయాడు.

ఇదంతా విని మా అన్నయ్య నవ్వేసి "అవన్నీ మనకెందుకు రా.. మన పొలంలోనే మనం కార్తీక వన భోజనాలూ, రుద్రాభిషేకం చేసుకుందాం. పుణ్యమూ, పురుషార్థం దక్కుతాయి" అని అన్ని ఏర్పాట్లూ చేశాడు.

"మన పవిత్ర భారత దేశంలో కాదేదీ కులానికి అతీతం. అన్నీ మనల్ని పురోగ "ముంచడం" కోసమే పుట్టుకొస్తున్నాయి సుమా" ఇప్పుడు నాకు మళ్ళీ అర్థం అయింది. "మనం" హాయిగా అమెరికాలో కులాసాగా ఉండక మనకెందుకు ఈ గొడవ అనుకుంటూ ఉండగా అటు ట్రంపు గారు నెగ్గి ..ఇప్పుడు నానా కంపూ చెయ్యడం మొదలు పెట్టాడు. ఇప్పుడు అమెరికా వెనక్కి వెళ్ళగలనో, వెళ్ళగొట్టబడతానో తెలీదు.

❖❖❖❖❖




SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by: DSLRCREW

# పావురాల అతిథి సత్కారం

-పెయ్యేటి నాగేంద్ర కుమార్, హైదరాబాద్

మహాభారతములో ధర్మరాజు, అంపశయ్యపైనున్న భీష్ముని పితామహా, **శరణు అన్న వారిని కాపాడాలి అనుకునే వారికి ఎటువంటి ఫలితము దక్కుతుంది.** అనగా శుక్రాచార్యుడు ముచికుందుడు అనే రాజుకి ఈ గాధను చెప్పాడు అని ఇలా చెప్పసాగాడు భీష్ముడు.

ఒక బోయవాడు అరణ్యములోకి వేటకు వెళ్ళి కొన్ని పక్షులను పట్టుకున్నాడు. ఇంతలో భయంకరమైన గాలివాన వచ్చింది. చీకటి పడింది. అడివంతా జలమయమైంది. అతడు ఓ మర్రిచెట్టు కింద తలదాచుకున్నాడు. తనను ఈ ఆపద నుండి కాపాడమని, ఇక ఈ జీవహింస చేయనని ఆ చేట్టుని వేడుకున్నాడు. ఆ చెట్టుమీద ఒక పావురము గూడుకట్టుకుని నివస్తిన్నది. దాని భార్య ఆహారము కొరకు వెళ్ళి ఇంకా తిరిగి రాలేదు. ఆ మగ పావురము తన భార్య రానందుకు బాధపడుతున్నది. నా భార్య లేని బతుకు నాకు ఎందుకు ఈ గూడు పాడుపడినట్టుగా వుంది అని దుఖిస్తున్నది.కానీ ఆ ఆడ పావురము ఆ చెట్టుకింద తలదాచుకుతున్న బోయవాని వలలో వుంది. అది తన భర్త మాటలు విన్నది. ఆ ఆడపావురము ఆహా నా జన్మ సార్ధకమైంది. నేను ఎంత పుణ్యాత్మురాలినో కదా నా భర్త మాటలు చెవులారా విన్నాను,ఆయనకు నేనంటే ఎంత ప్రేమ,అనురాగము .ఆ ఆడ పావురం నేను ఇక్కడ ఈ బోయవాని వద్ద వున్నాను అని తన భర్తతో కిచ కిచ అని అరిచి చెప్పింది. ఆ అరుపులు మగ పావురము విన్నది. అపుడు భార్య పావురము తన భర్త పావురము తో ఇలా చెప్పింది. నాధా ఈ బోయవాడు ఈ వానలో ఇక్కడకు చేరి ఈ చెట్టు శరణుజొచ్చాడు. కావున నీవు ఇతడికి అతిధి సత్కార్యములు చేయి అనగా, మగపావురము ఆ బోయవాని ముందు వాలి, అయ్యా! మీరు మాకు అతిధులు,మీకు ఏ విధమైన సత్కారము చేయను అనగా, ఆ బోయవాడు నాకు బాగా చలిగా వుంది అన్నాడు. అపుడు ఆ మగ పావురము అక్కడక్కడా వున్న ఎండు చితుకులను తెచ్చి మంట చేసింది. ఆ మంటలో ఆ బోయవాడు చలికాచుకున్నాడు. తరువాత తనకు ఆకలిగా వుంది అని అడిగాడు. అపుడు ఆ పావురము అయ్యా మేము , మాకు ఎప్పుడు ఆకలివేస్తే అప్పుడు ఆహారము కోసము వెళ్ళి తెచ్చుకుంటాము. మీరు మా పావురాలను ఆహారముగా తింటారు కదా అని ఆ మగ పావురము ఆ మంటలో పడి కాలిపోయింది. ఇది చూసిన బోయవానికి జ్ఞానోదయమయ్యింది. ఛీ, నాదీ ఒక బతుకేనా,ఈ పావురమునకు ఉన్న జ్ఞానము నాకు లేదు. అని తన వలలో ఉన్న పక్షులనన్నిటినీ విడిచిపెట్టాడు.బోయవాని చెర నుండి విముక్తి పొందిన ఆడ పావురము తన భర్త మరణానికి విలపించింది. తన భర్త లేని బతుకు తనకు ఎందుకు అని తాను కూడా ఆ మంటలో పడి కాలిపోయింది.అప్పటికే దివ్య మైన విమానములో దేవలోకము చేరిన మగ పావురము తన భార్య కోసము ఎదురు చూస్తున్నది. ఇదంతా చూసిన ఆ బోయవాడు తనవద్దనున్న వలలను మిగిలిన వేట సామాగ్రిని వదిలి వెళ్లిపోయాడు. తమను శరణు జొచ్చిన ఆ బోయవానికి అతిధి సత్కారములు చేసి ఆ పావురములు దివ్యత్వమును పొందాయి.

ఈ కధ వలన మనకు తెలిసిన నీతి ఏమనగా ఆపదలో నున్న వారిని,తనను శరణు జొచ్చిన వారిని ఆ రక్షించాలి.

సంకలనము మహాభారతము నుండి

❖❖❖❖❖







Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au



## బాలవాహిని

### శ్రీకృష్ణ శతక పద్యాలు



శ్రీ రుక్మిణీశకేశవ
నారద సంగీతలోల నగధర శౌరీ
ద్వారక నిలయ జనార్ధన
కారుణ్యముతోడ మమ్ము గావుము కృష్ణా!

SrI rukmiNISakESava
nArada sangItalOla nagadhara SourI
dwAraka nilaya janArthana
kAruNyamutODa mammu gAvumu kRshNA!

నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడు నీడ నీవే సఖుడౌ
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!

nIvE tallivi tamDrivi;
nIvE nA tODu nIDa nIvE sakhuDou
nIvE guruDavu daivamu;
nIvE nA patiyu gatiyu nijamuga kRshNA!

తెలుగు బడి

Telugu Badi

# తెలుగు బడికి ఆహ్వానం

## Welcome to Telugu Language School

**We provide:**

- Caring teachers
- Personal attention
- Attractive learning activities
- Outcomes based teaching

**A great opportunity for your child to learn Telugu.**

Enrol in your nearest school today for 2020 starting on Sun, 2-Feb-2020.

**Our Schools:**

- Strathfield South PS
- Hambledon PS (Quakers Hill)
- Darcy Rd PS (Wentworthville)
- Eastwood PS
- Beaumont Hills PS (Kellyville)

**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details,
Visit: www.sydneytelugu.org
Call: 0402 169 963
Email: school@sydneytelugu.org


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au


BIRYANI HOUSE
PARADISE
Biryani House
BIRYANI HOUSE
14 George Street North Strathfield
Open 7 Days for Lunch and Dinner
Call us : 0297635282

❖❖❖❖❖




08:00 - 10:00 AM Sydney Time on Sat
02:30 - 04:30 AM India time
16:00 - 18:00 Hrs New York Time (Day -1 or Fri)
[ For India/US +1 Hour during Australia Winter Time]

Listen to Radio on 2TripleO FM 98.5 or DAB 985 or

You can also listen on PC/ internet, the URL is:
https://2tripleo.com.au/en-au/
http://s7.viastreaming.net/8500/m/

The program can also be listened over phone-audio by dialling: **+61 2 8080 5650**

via **TuneIn** App on **Android | iPhone**

**తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని**
**2TripleO FM98.5 MHz**
**DAB 985**
**Saturdays 08:00 – 10:00AM Sydney Time**

27 సంవత్సరాలుగా సిడ్నీ తెలుగువారిని ప్రతి శనివారం ఉదయం 08:00 - 10:00 గంటల వరకు, మంచి మంచి అంశాలతో అలరిస్తూ, 25 ప్రసారకుల స్వచ్ఛంధ సేవలతో  రేడియో కార్యక్రమాలను అందిస్తున్న తెలుగువాణి కార్యక్రమాలను
2TripleO FM 98.5 అలవరసాలపై
**వినండి. వినిపించండి. వింటూ ఉండండి.**
ప్రసారకులుగా కార్యక్రమాలు అందించాలనే ఆసక్తి ఉన్నవారు;
కారక్రమాలకు ఆర్ధికంగా ప్రోత్సాహం అందించ తలచుకున్నవారు;
వ్యాపార ప్రకటనలను ఇవ్వదలచుకొన్నవారు;
మా కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలియచేయాలనుకొనేవారు – సంప్రదించండి:

శ్రీ సారధి మోటమర్రి, 0430 022 130 or vani@sydneytelugu.org

**https://www.facebook.com/TeluguVaniSydney**

❖❖❖❖❖





❖❖❖❖❖

# ఆధునిక రచయిత్రుల పరిచయాలు

- శ్రీమతి అనురాధ యలమర్తి, హైద్రాబాద్






1875 నుంచి 2000 వరకు ఆధునిక యుగంగా పరిగణిస్తాము.

అప్పటి రచయిత్రులను నేను పరిచయం చేస్తున్నాను. వీరంతా కథ,నవలల రచయిత్రులే!

**మాలతీ చందూర్**

ముందుగా **మాలతీ చందూర్** గారు. వీరు నవలా రచయిత్రి మరియు కాలమిస్ట్ కూడా . కృష్ణా జిల్లా నూజివీడులో జన్మించారు. ఏలూరులో పదో తరగతి వరకు చదువుకొని చందూర్ నాగేశ్వరరావు

గారిని వివాహమాడి మద్రాసులో స్థిరపడ్డారు.

వీరు జీవితంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలు, పరిష్కారాలు గురించి రచనలు చేసేవారు. ఆంధ్రప్రభ లో ప్రమదావనం శీర్షిక ను 47 సంవత్సరాల పాటు నిర్వహించారు .పాఠకుల సమస్యలకు పరిష్కారాలు సూచించేవారు. 26 ఆరు నవలలు రాశారు .300 నవలను అనువదించారు.

వీరి "హృదయనేత్రి " నవల కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుని అందుకుంది.

1957 నుంచి మూడు దశాబ్దాలు వీరు రచనా వ్యాసంగంలో కొనసాగారు.

సెన్సార్ బోర్డు మెంబర్ కూడా.

పద్మావతి విశ్వవిద్యాలయం ద్వారా డాక్టరేట్ పొందారు.

కథలు కూడా రాసేవారు. "శతాబ్ది సూరీడు" నవల లో నాలుగు తరాల వారిని వర్ణించిన తీరు అమోఘం.

వివరణతో కూడిన రచనలు వీరివి.

చంపకం- చీడపురుగులు, భూమిపుత్రి, మనసులో మనసు, కృష్ణవేణి మొదలగు నవలలు రాశారు.

2013లో అనారోగ్యంతో మరణించారు .తన దేహాన్ని అవయవదానానికి రామచంద్ర హాస్పటల్ కి సమర్పించారు.

రచయిత్రులు ఎప్పుడూ చిరంజీవులే అని నాకు అనిపిస్తుంది .







## మాదిరెడ్డి సులోచన

తెలంగాణా, శంషాబాద్ ఊరులో 1935 లో జన్మించారు.

వీరు నవలా రచయిత్రి.ఎం.ఏ,ఎం.ఈడీ చేసి ఉపాధ్యాయునిగా దేశ విదేశాలలో పనిచేశారు. కుటుంబ చిత్రణ, వాస్తవికతకు దగ్గరగా వీరి రచనలు ఉంటాయి.

72 నవలలు రాశారు .10 సినిమాలు గా వచ్చాయి.

విశేషంగా పాఠకులతో చదివించే అలవాటు వీరి నవలల వల్లనే వచ్చిందని చెబుతారు.

చిగురాకులలో చిలకమ్మా, ఋతుచక్రం, ఇల్లు కట్టి చూడు, నాతో పాటు నలుగురు మొదలగునవి వీరి నవలలు. అద్దాలమేడ ప్రేమలు-పెళ్ళిళ్ళు సినిమాలు గా వచ్చినవి. గృహలక్ష్మి స్వర్ణకంకణం పురస్కార గ్రహీత.

1984లో గ్యాస్ సిలిండర్ ఇంట్లో పేలటం వలన మృతిచెందారు . వీరి మొదటి నవల జీవయాత్ర.

## యద్దనపూడి సులోచనారాణి



మొవ్వ మండలం కాజా లో 1944 జన్మించారు.

నవలా రాణిగా కీర్తి గడించారు .

అందగాడు, మానవతావాది వీరి నవలలో హీరో.

ఇక హీరోయిన్ హిమాలయ శిఖరమంత ఉన్నత వ్యక్తిత్వం తో మధ్యతరగతి స్త్రీ పాత్ర లో ఒదిగిపోతుంది. చూస్తున్నట్లే ఉంటుంది వీరి రచన.

ప్రతి మనిషి జీవితం ఒక పుస్తకమే అని వీరంటారు.

వీరి. పాడుగాటి కారే మాకు మార్గదర్శకం అని కొమ్మనాపల్లి గణపతిరావు,యండమూరి వీరేంద్రనాథ్ గారు చెబుతారు.

వీరు ఎందరో రచయితలకు మార్గదర్శి.

అప్పటికీ ఇప్పటికీ ఈవిడ ట్రెండ్ సెట్టరే.

అప్పటి మీనా..ఇప్పటి త్రివిక్రం గారి అ.. ఆ సినిమాలు దీని నిరూపిస్థాయి.

జీవనతరంగాలు, సెక్రటరీ, బంగారు కలలు, ఆత్మ గౌరవం సినిమాలు అత్యంత ఆదరణ పొందాయి.

రాధ -మధు,ఋతు రాగాలు టీవీ సీరియల్స్ కూడా వీరివే. అవి ఎంత ఆదరణ పొందాయో మీ అందరికీ తెలుసు.

40 నవలలు రాశారు. 78 సంవత్సరాల వయసులో 2018 మరణించారు.

## పోలాప్రగడ రాజ్యలక్ష్మి

నవల, కథా రచయిత్రి. 1938లో తూర్పుగోదావరి ఆలమూరు లో జన్మించారు. అక్షరాలతో ఆడుకుంటానంటారు వీరు.

వీరి శృతితప్పిన వీణలు పెళ్లి వ్యవస్థను ,విలువలను తెలియజేస్తుంది.

ఏదైనా ఓ అంశాన్ని తీసుకొని అందులో సమస్యలను పరిష్కారాలను చూపిస్తా అని చెబుతుంటారు తన నవలల్లో.

వీరి "రెల్లుపొదలు" యూనివర్సిటీ ఎం.ఎ వారికి పాఠ్యాంశంగా తీసుకున్నారు.

వీరు రాసిన కనపర్తి వరలక్ష్మమ్మగారి జీవిత చరిత్రను ఐ. ఎ. యస్ వారికి సిలబస్ గా తీసుకున్నారు.

వీరి 10 కవితలు ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ వారు తెలుగులో,హిందీ లో ప్రచురించారు.

రాష్ట్రపతివి.వి.గిరి గారి భార్య పుస్తకానికి అభిప్రాయాన్ని కూడా వెలిబుచ్చారు .

వరల్డ్ ఫెమినిస్ట్ ఎంతలాగో వాళ్ళు వీరి నిజానిజాలు కథను ప్రచురించారు .

13 నవలలు రాసారు.శరన్మే

ఘం

ఆంధ్రజ్యోతి లో సీరియల్ గా వచ్చింది .

ఇటుఊరు, అటు ఏరు, జీవనస్రవంతి,దరి చేరిన కెరటం మొదలగు నవలలు ప్రచురించారు.

## తమిరిశ జానకి

వీరు 20 .10. 46 కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం అనే ఊరులో జన్మించారు. సొంత ఊరు నర్సాపురం .మొత్తం 26 నవలలు రాశారు. విశాలి సీరియల్ సినిమాగా వచ్చింది. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి రెండుసార్లు పురస్కారాన్ని అందుకున్నారు.కెనడా తెలుగు అసోసియేషన్, అమెరికా వారి ద్వారా సత్కరింపబడ్డారు.

1960 నుంచి రచనా వ్యాసంగం ప్రారంభించారు. అంటే సరిగ్గా ఇప్పటికీ 60 సంవత్సరాలు అన్నమాట.

16 నవలలు రాశారు

వెన్నెల విరిసింది ,వీడినమబ్బులు , అందానికి సమాధి ,ఇది ఏ రాగమో , మలుపు, బొమ్మలు, జీవితచక్రం,కథలాంటి జీవితం, అశోకవనంలో సీత, మనసుపాడింది సన్నాయిపాట,ముఖారిరాగం ,నీలిచందమామ , రాజహంస , సాగరి. కథాసంపుటాలు--

మూగమనసులు, మనసిది నీకోసం , మరొకతలుపు , డా.రచయిత, ఎంతో చిన్నది జీవితం , తమిరిశ జానకి మినీకథలు, సైలెంట్ స్ట్రీమ్ , ఆడది.

కవితా సంపుటాల పేర్లు-కవితాసుమాలు , స్వప్న పుష్పాలు.

❖❖❖❖❖




తెలుగు అసోసియేషన్ సిడ్నీ

